

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | గురువారం 27-03-2025 | సంపుటి - 22 | సంచిక - 333 | రూ : 4 | పేజీలు: 8




## కేటీఆర్ వ్యాఖ్యలపై శాసనసభలో దుమారం

- కమీషన్ల ఆరోపణలపై భట్టి ఆగ్రహం
- ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడాలంటూ వ్యాఖ్య
- సభ నుంచి వాకౌట్ చేసిన భారాస

హైదరాబాద్: మాజీ మంత్రి, ఎమ్మెల్యే కె.తారక రామారావు బుధవారం శాసనసభలో చేసిన కమీషన్ వ్యాఖ్యలు దుమారం రేపాయి. కేటీఆర్ వ్యాఖ్యలను ఖండిస్తూ కాంగ్రెస్ సభ్యులు సభలో ఆందోళన చేశారు. ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడాలని ఉప

తరువాయి 2లో

### రైతులకు ఉచితంగా

# సూక్ష్మ పోషకాలు

- ఆక్వా రైతులకు రూ. 1.50కే యూనిట్ విద్యుత్
- ఐదు హబ్‌లుగా రాష్ట్రంలో అభివృద్ధి
- కర్నూలు జిల్లాపై ప్రత్యేక శ్రద్ధ
- నవంబర్‌లో సత్యసాయి శతజయంతి వేడుకలు నిర్వహిద్దాం
- కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు

అమరావతి: 'రాష్ట్రంలో రైతులకు ఉచితంగా సూక్ష్మ పోషకాలు సరఫరా చేద్దాం. దీనివల్ల పంటల దిగుబడి పెరుగుతుంది. ఆక్వా రైతులకు యూనిట్ విద్యుత్తు రూ.1.50కే ఇద్దాం. జోన్,

తరువాయి 2లో





## అపచారం.. అపచారం..

- వైకాపా హయాంలో శ్రీవారి నిత్య నైవేద్యాలకు నాసిరకం సరకులు
- సరఫరాదారుకు నిబంధనలకు విరుద్ధంగా ప్రయోజనాలు

తిరుమల: తిరుమల శ్రీవారి క్షేత్రాన్ని వైకాపా ఐదేళ్ల పాలనలో నానా రకాలుగా భ్రష్టు పట్టించిన నాటి తితిదే పెద్దలు, అధికారులు.. తుదకు వేంకటేశ్వర స్వామివారికి సమర్పించిన నైవేద్యంలోనూ కల్తీ సరకులు వాడిన సంగతి బయటపడింది. దాత ముసుగులో వచ్చిన ఓ వ్యాపారినాలుగేళ్ల పాటు నిరాటంకంగా సాగించిన అపచారాన్ని కూటమి ప్రభుత్వం

తరువాయి 2లో

## పాక్షిక యుద్ధ విరమణకు సిద్ధమే

- ఒప్పందాలు ఉల్లంఘిస్తే రష్యాపై ఆంక్షలు విధించాలి: జెలెన్‌స్కీ



కీవ్: ఇంధన సంబంధిత మౌలిక సదుపాయాల వరకు పాక్షిక యుద్ధ విరమణకు తాము సిద్ధమేనని ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్‌స్కీ ప్రకటించారు. సౌదీ అరేబియాలో ఉభయపక్షాలతో అమెరికా మాట్లాడి ఈ మేరకు ప్రతిపాదించిన ఒప్పందం ప్రకారం ముందుకు వెళ్లేందుకు తాము సన్నద్ధంగా ఉన్నామని మంగళవారం రాత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విలేకరులకు ఆయన తెలిపారు. ఒప్పందాలను రష్యా ఉల్లంఘిస్తే ఆ దేశంపై ఆంక్షలు విధించాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ను కోరతానని చెప్పారు. తమకు

తరువాయి 2లో



## అది అమానవీయ, క్రూరమైన అభిప్రాయం

- అత్యాచార నేరంపై అలహాబాద్ హైకోర్టు తీర్పును తప్పుపట్టిన సర్వోన్నత న్యాయస్థానం
- న్యాయమూర్తి వివాదాస్పద వ్యాఖ్యలపై స్టే విధింపు

దిల్లీ: మహిళల దుస్తులు లాగడం, ఛాతీ భాగాన్ని తాకడం అత్యాచార నేరం కిందకు రాదని, బలవంతపెట్టడం లేదా వివస్త్రను చేసే యత్నంగానే పరి గణించాలన్న అలహాబాద్ హైకోర్టు జడ్జి తీర్పులోని వ్యాఖ్యలపై సర్వోన్నత న్యాయస్థానం 'స్టే' విధించింది. హై కోర్టు జడ్జి వ్యక్తపరిచిన అభిప్రాయం అమానవీయమైన, క్రూరమైనదిగా అభి వర్ణించింది. న్యాయ సూత్రాలకు పొసగని ఈ వివాదాస్పద తీర్పును తీవ్రంగా పరి గణిస్తున్నామని జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మసీహ్‌ధర్మాసనం స్పష్టం చేసింది. భారత ప్రధాన

తరువాయి 2లో

# ఉప ఎన్నికలు రావు



- మా దృష్టి అభివృద్ధి, సంక్షేమంపైనే
- వ్యసనాలకు తెలంగాణలో తావులేదు
- ఆన్‌లైన్ బెట్టింగ్, యాప్‌లపై సిట్ ఏర్పాటు
- శిక్ష పెంచేలా చట్ట సవరణ
- అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

హైదరాబాద్ : రాష్ట్రంలో ఉప ఎన్నికలు రావని.. గత ప్రభుత్వ హయాంలో పార్టీ మారిన ఎమ్మెల్యేల విషయంలో ఏం జరిగిందో ఇప్పుడూ అదే జరుగుతుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వం దృష్టి అభివృద్ధి, సంక్షేమంపైనేనని స్పష్టం చేశారు. రాష్ట్ర అభివృద్ధికి భారాస అడ్డం పడుతోందని, పెట్టుబడులు రాకూడదనే ఉద్దేశంతో తప్పుడు ప్రచారం చేస్తోందని నిప్పులు చెరిగారు. బుధవారం హోం, అడ్మినిస్ట్రేషన్ పద్దుపై జరిగిన చర్చలో సీఎం మాట్లాడారు.

*** 2014-23 సంప్రదాయాల్నే అనుసరిస్తాం**

"20142023 మధ్యకాలంలో విపక్ష ఎమ్మెల్యేల్ని భారాస తమ పార్టీలో చేర్చుకుంది. కొందరు మంత్రులు కూడా అయ్యారు. వారెవరిపైనా అనర్హత వేటు పడలేదు. అప్పటి నుంచి

తరువాయి 2లో



## భూ భారతితో సమస్యలకు చరమగీతం

* మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ఒక మంచి రోజు చూసుకుని ఏప్రిల్‌లో ప్రారంభించనున్న భూ భారతి చట్టం, పోర్టల్‌లతో తెలంగాణలోని భూ సమస్యలన్నింటికీ చరమగీతం పాడతామని రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. శాసనసభలో రెవెన్యూ, రిజిస్ట్రేషన్లు, గృహ నిర్మాణం, సమాచార పౌరసంబంధాల శాఖల పద్దులపై బుధవారం జరిగిన చర్చ సందర్భంగా సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన

తరువాయి 2లో



## పాస్టర్ ప్రవీణ్‌కుమార్ మృతిపై తీవ్ర ఉద్రిక్తత

- క్రైస్తవ సంఘాల ప్రతినిధులు భారీగా రాక
- రాజమహేంద్రవరం జీజీహెచ్‌లో పోస్టుమార్టం పూర్తి
- సమగ్ర విచారణకు సీఎం చంద్రబాబు ఆదేశం
- ఘటనకు కారణాలపై ప్రాథమిక నిర్ధారణకు రాలేదు: ఎస్పీ

2లో

## ఆగ్రాలో సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ ఇంటిపై దాడి

- రాణా సంగాపై వ్యాఖ్యలకు క్షమాపణలు తెలపాలన్న కర్ణి సేన

2లో



# ఉప ఎన్నికలు రావు

(మొదటిపేజీ తరువాయి)

ఇప్పటివరకు చట్టం, న్యాయం, రాజ్యాంగం మారలేదు. ఏ రాజ్యాంగం ప్రకారం ఉప ఎన్నికలు వస్తాయి? 201423 వరకు ఈ సభ అనుసరించిన విధానాలనే మేమూ అనుసరిస్తాం. రూల్ బుక్ కూడా మారలేదు. వారు రాసిందే ఈ పుస్తకం (రూల్‌బుక్ చూపిస్తూ). ఎలాంటి ఉప ఎన్నికలు రావు'' అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఒకాయన ఉప ఎన్నికల్లో 'నేనే అభ్యర్థిని' అంటూ ప్రచారం చేసుకుంటున్నారు. ఆయన పదవిలో ఉన్నప్పుడు మంచి పంచె కట్టుకుని తిరిగారు. అలా తిరిగితే పదవి పోతుందని నేను ఆనాడే హెచ్చరించా. అలా చెప్పిన నెల రోజుల్లోనే ఆయన ఉపముఖ్యమంత్రి పదవిని తీసేశారు. ఆ అమాయకుడే ఇప్పుడు వారంలో ఉప ఎన్నికలని తిరుగుతున్నారు'' అని రేవంత్ అన్నారు. ఎమ్మెల్యేలు పార్టీ మారిన అంశం సుప్రీంకోర్టులో ఉందని, ఇక్కడ ఎలా మాట్లాడతారని భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు అభ్యంతరం వ్యక్తం చేశారు. అసెంబ్లీ లోపల మాట్లాడేందుకు సభ నుంచి రక్షణ ఉంటుందని సీఎం అన్నారు.

*** జమిలి వస్తే 2029లోనే ఎన్నికలు**

''భాజపా ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి చెబుతున్నట్లు జమిలి ఎన్నికలు వస్తే ఈ అసెంబ్లీ గడువు మరో ఆరు నెలలు పెరుగుతుంది. 2028కి బదులు 2029లో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయి' అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. 'నేను ఆయన (కేసీఆర్‌ను ఉద్దేశిస్తూ) అడుగుజాడల్లో నడవడం లేదు. అలా నడిస్తే మడుగుల్లో పడతాం' అని అన్నారు.

*** పెట్టుబడులు రాకుండా ప్రతిపక్షం కుట్ర**

''ఏ మంచి పని చేద్దాం అన్నా.. తెలంగాణలో శాంతిభద్రతలపై ప్రతిపక్షం దుష్ప్రచారం చేస్తోంది. రాష్ట్రం ఆర్థికంగా కుప్పకూలిందని అబద్ధాలు చెబుతోంది. ఆ నేతలు పెట్టుబడులు రాకుండా కుట్రలు చేస్తున్నారు. ఈ తీరు తెలంగాణకు మంచిది కాదు. భారాస హయాంలో వామనరావు దంపతుల్ని నడిరోడ్డుపై నరికి చంపినా నాటి ప్రభుత్వం చర్యలు తీసుకోలేదు. ఆరోపణలు ఉన్న వ్యక్తిని కేసు నుంచి తప్పించి, ఎన్నికల్లో బీఫారం ఇచ్చారు. జూబ్లీహిల్స్ అత్యాచార ఘటనలో భారాస నాయకుడి కుమారుడున్నా చర్యలు తీసుకోలేదు. మహిళలపై అఘాయిత్యాల్లో అప్పుడు తెలంగాణ దేశంలోనే నాలుగో స్థానంలో ఉంది. కొద్దిరోజుల క్రితం 'ఎంఎంటీఎస్ రైలు ఘటన' జరిగితే రైల్వే పోలీసుల పరిధి అయినప్పటికీ ఈ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించింది'' అని రేవంత్ వివరించారు.

*** జానారెడ్డి, భట్టిని ఆదర్శంగా తీసుకోవాలి..**

''భారాస నేతలు కడుపునిండా విషం పెట్టుకుని మాట్లాడుతున్నారు. అసెంబ్లీలో ప్రతిపక్షనేతగా జానారెడ్డి ఉన్నప్పుడు పార్టీ కంటే తెలంగాణ ప్రయోజనాలకు ప్రాధాన్యమిచ్చారు. భట్టివిక్రమార్క కూడా ప్రతిపక్షనేతగా ప్రభుత్వానికి సలహాలు ఇచ్చారు. కక్షగట్టి విపక్షహోదా తీసేసినా ఆయన సూచనలు ఇచ్చారు. మీరు (ప్రతిపక్షం) కూడా జానారెడ్డి, భట్టి విక్రమార్కలను ఆదర్శంగా తీసుకోవాలి.

*** కేసీఆర్ కలిసినా గజ్వేల్ అభివృద్ధిపై మాట్లాడతా**

భారాసలో ఇద్దరు నాయకుల మధ్య అంతర్గతపోరు ప్రభుత్వానికి తలనొప్పిగా మారింది. ఒకరు ఉదయం ప్రెస్‌మీట్ పెడితే, మధ్యాహ్నం మరొకరు 'ఎక్స్'లో పోస్టు పెడతారు. నా దగ్గరకు హరీశ్‌రావు, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, భాజపా వెంకటరమణారెడ్డి... ఇలా ఎవరు నియోజకవర్గ సమస్యలు తెచ్చినా పరిష్కరించేందుకు ప్రయత్నిస్తా. వారే కాదు.. గజ్వేల్ ఎమ్మెల్యే కేసీఆర్ వచ్చినా గౌరవిస్తా. గజ్వేల్ అభివృద్ధిపై మాట్లాడతా. ఎవరిపైనా వివక్ష చూపించం. భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్ 95 శాతం నిజం కాబోతోంది. 201423 మధ్య బడ్జెట్లలో ఆచరణ సగటున 25 శాతం తేడా ఉంది'' అని సీఎం తెలిపారు.

*** గుంటనక్కలకు గుణపాఠం చెబుతాం**

గచ్చిబౌలిలో 400 ఎకరాల భూమి సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ)ది కాదు. ఆ భూమిని దాదాపు 25 ఏళ్లక్రితం అప్పటి ప్రభుత్వం ఐఎంజీకి కేటాయించింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక సుప్రీంకోర్టులో పోరాడి కేసు గెలిచాం. భూముల్ని స్వాధీనం చేసుకుని, టీజీఐఐసీకి కేటాయించాం. అంతర్జాతీయ పెట్టుబడుల ఆకర్షణకోసం అభివృద్ధి చేయబోతున్నాం. ఆ భూముల్లో రక్షిత అటవీప్రాంతం ఉన్నట్లు, జీవరాశులు తిరుగుతున్నట్లు, చెరువులు, రాళ్లు ఉన్నాయంటూ మాట్లాడుతున్నారు. నిజనిర్ధారణ కమిటీ వేద్దాం. ఎమ్మెల్యేలను తీసుకెళ్లి చూపిద్దాం. అక్కడ నక్కలు, పులులు, సింహాలు లేవు. ఆ భూముల చుట్టూ గుంటనక్కలు చేరి వివాదం చేస్తున్నాయి. ఆ గుంటనక్కలకు గుణపాఠం చెబుతాం. ఆ భూమి 100 శాతం అభివృద్ధి చెందిన ప్రాంతంలో ఉంది. హెచ్‌సీయూకి ఆ భూములతో ఏం సంబంధం'' అని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు.

*** అభివృద్ధి... ఆర్ఆర్ఆర్ వద్దా?**

''ఆమనగల్లుకు రోడ్డు అంటే మా అత్తగారి ఊరుకు రోడ్డు వేస్తున్నారని హరీశ్‌రావు ఆరోపించారు. ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ మధ్య అనుసంధానానికి వేసే 11 రేడియల్ రోడ్లలో అది ఒకటి. ఆ కుటుంబం ఆ గ్రామాన్ని వదిలి ఐదు దశాబ్దాలు అయింది. వాళ్లు అనుకుంటే సొంత ఖర్చులతో రెండింతల పెద్ద రోడ్డు వేసుకునే ఆర్థిక స్తోమత ఆ కుటుంబానికి ఉంది. ప్రతిపక్షాన్ని నేను అడుగుతున్నా.. రాష్ట్రంలో అభివృద్ధి వద్దా? ఆర్ఆర్ఆర్ వద్దా? ఫ్యూచర్‌సిటీ కట్టాలా? వద్దా? మూసీ పునరుద్ధరణ చేయాలా?వద్దా? ఫ్యూచర్‌సిటీని.. ఫోర్ బ్రదర్స్ సిటీ అని ఆరోపిస్తున్నారు. అది నాలుగు కోట్ల సోదర సోదరీమణుల భవిష్యత్ నగరం'' అని సీఎం తెలిపారు.

# కేటీఆర్ వ్యాఖ్యలపై శాసనసభలో దుమారం

(మొదటిపేజీ తరువాయి)

ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అనడంతో సభలో మరింత ఉద్రిక్తత తలెత్తింది. భారాస క్షమాపణలు చెప్పాలంటూ కాంగ్రెస్ సభ్యులు, కాంగ్రెస్ క్షమాపణల్ని డిమాండ్ చేస్తూ భారాస సభ్యులు సభలో ఆందోళనకు దిగారు. భారాస సభ్యులు పోడియం ముందుకు వచ్చి భట్టి వ్యాఖ్యలపై నిరసన తెలిపారు. దీంతో సభలో కొద్దిసేపు గందరగోళం నెలకొంది. బుధవారం సభ ప్రారంభం కాగానే వివిధ శాఖల పద్దులను మంత్రులు ప్రవేశపెట్టారు. రెవెన్యూ, గృహ నిర్మాణం పద్దులపై భారాస సభ్యుడు కేటీఆర్ మాట్లాడారు. ''సభలో ఎన్ని సార్లు అంతరాయం కలిగిస్తారు? మంత్రులు అలా మాట్లాడితే ఎలా? ప్రతిపక్షాలు సహజంగానే ప్రభుత్వం అమలు చేయని హామీలను, చేయని పనులను ఎత్తి చూపుతాయి. 30 శాతం కమీషన్ అని వాళ్ల ఎమ్మెల్యేలే అంటున్నారు. 20 శాతం కమీషన్ అని సచివాలయంలో ధర్నాలు అవుతున్నాయి'' అని కేటీఆర్ అన్నారు. కమీషన్ వ్యాఖ్యలపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆగ్రహం వ్యక్తం చేశారు. ''మేము ఓ బాధ్యతతో రాజకీయాల్లోకి వచ్చాం. అడ్డగోలుగా మీలాగా రాష్ట్రంలో పడి బరితెగించి దోపిడీ చేయడానికి రాలేదు. ప్రజలకు సేవ, మేలు చేయాలని వచ్చాం. వివిధ వర్గాలను ఆదుకోవడానికి ఉన్నతమైన ఆలోచనలతో ఉన్నాం. మాట్లాడేది నిజమో కాదో తెలుసుకుని మాట్లాడాలి'' అని భారాస సభ్యులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 30 శాతం కమీషన్ అంటూ చేసిన అనుచిత వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగిస్తున్నట్లు ప్యానెల్ స్పీకర్ రేవూరి ప్రకాశ్‌రెడ్డి ప్రకటించారు. 'బట్టలు ఊడతీసి కొడతాం.. ఒళ్లు దగ్గర పెట్టుకో..' వంటి వ్యాఖ్యలు చేయవచ్చా, ఇవీ అనుచిత వ్యాఖ్యలు కావా అంటూ భారాస సభ్యులు ప్రశ్నించారు. ఈ గందరగోళం మధ్యలోనే భట్టి వ్యాఖ్యలపై తనకు మాట్లాడడానికి అవకాశం కల్పించాలని కేటీఆర్ కోరారు. అందుకు ప్యానల్ స్పీకర్ ఒప్పుకోలేదు. భాజపా సభ్యుడు హరీశ్‌బాబును చర్చ కొనసాగించాలని కోరారు. దీంతో భారాస సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు.

# రైతులకు ఉచితంగా సూక్ష్మపోషకాలు

(మొదటిపేజీ తరువాయి)

నాన్ జోన్ అని లేకుండా ఎక్కడ ఆక్వా రైతు రిజిస్ట్రేషన్ చేసుకున్నా వారికి రాయితీపై విద్యుత్తు అందిద్దాం. రిజిస్ట్రేషన్ చేసుకోకపోతే రాయితీపై విద్యుత్తు ఇవ్వబోం. కలెక్టర్ల సదస్సులో తీసుకున్న నిర్ణయాలు ఇవి' అని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. రాష్ట్ర సచివాలయంలో కలెక్టర్ల సదస్సు రెండో రోజు (బుధవారం) తీసుకున్న అనేక నిర్ణయాలను ఆయన వెల్లడించారు. విశాఖనగరం చుట్టుపక్కల ప్రాంతాలు ఒక హబ్‌గా.. రాజమహేంద్రవరంకొవ్వూరు సమీప ప్రాంతాలు గోదావరి హబ్‌గానూ, అమరావతివిజయవాడ, కర్నూలు, సత్యసాయి, అనంతపురాలు మరో హబ్‌గా, తిరుపతి చుట్టుపక్కల పంచాయతీలు ఆ కార్పొరేషన్‌తో కలిపి మరొకటి.. ఇలా ఐదు హబ్‌లను రాష్ట్రంలో అభివృద్ధి చేస్తామని చంద్రబాబు తెలిపారు. ఇప్పటికే విశాఖ చుట్టుపక్కల ప్రాంతాలకు సంబంధించి నీతి ఆయోగ్ ఒక నివేదిక సిద్ధం చేసిందని ముఖ్యమంత్రి చెప్పారు. రానున్న రోజుల్లో హిందూపూర్, అనంతపురం మధ్య మంచి అభివృద్ధి జరుగుతుందన్నారు. మరో రెండేళ్లలో గోదావరి పుష్కరాలు జరగనున్న నేపథ్యంలో రాజమహేంద్రవరం, కొవ్వూరుతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో అభివృద్ధి పనులను ఇప్పటి నుంచే చేపడదామని ముఖ్యమంత్రి అన్నారు. ఈ ఏడాది నవంబరులో సత్యసాయి శతజయంతి వేడుకలు ఘనంగా నిర్వహిద్దామని, అందుకు ఇప్పటి నుంచే ఏర్పాట్లు చేసుకోవాలన్నారు.

# ద.కొరియాలో కార్చిచ్చు విధ్వంసం

(మొదటిపేజీ తరువాయి)

అక్కడి 7వ శతాబ్దానికి చెందిన పురాతన దేవాలయం ధ్వంసమైంది. దక్షిణాన ఉన్న చియోంగ్‌సాంగ్ జైలు నుంచి 500 మంది ఖైదీలను సురక్షితంగా తరలించినట్లు న్యాయశాఖ వెల్లడించింది. ఈ కార్చిచ్చు అత్యంత ఘోరమైందని, దీని కారణంగా తీవ్ర నష్టం వాటిలినట్లు ప్రధానమంత్రి, తాత్కాలిక అధ్యక్షుడు హన్ డక్ సూ తెలిపారు. మంటలను ఆర్పేందుకు 130 హెలికాప్టర్లు, 4650 మంది సైనికులు, అగ్నిమాపక సిబ్బంది శ్రమిస్తున్నారని అన్నారు.

# పాక్షిక యుద్ధ విరమణకు సిద్ధమే

(మొదటిపేజీ తరువాయి)

ఆయుధాలు కూడా ఇవ్వాలని అడుగుతానన్నారు. శాంతి ఒప్పందాల్లో భాగంగా నల్లసముద్రంలో సురక్షితమైన వాణిజ్య కార్యకలాపాలు నిర్వహించుకునేందుకు, వాణిజ్య నౌకలను సైనిక అవసరాలకు వినియోగించకుండా నిలువరించేందుకు ఇరుపక్షాలు అంగీకరించాయని తెలిపారు. ఈ ఒప్పందాలను రష్యా గౌరవిస్తుందని తాను నమ్మనని, షరతులను ఆ దేశం వక్రీకరిస్తోందని ఆరోపించారు. నిబంధనలను రష్యా ఉల్లంఘిస్తే.. ఆ దేశానికి సైనిక సాయం నిలిపివేసి.. అదనపు ఆంక్షలు విధించాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ను కోరతానని జెలెన్‌స్కీ చెప్పారు. ఉక్రెయిన్‌లోని అన్ని అణు విద్యుత్తు ప్లాంట్లను అమెరికా స్వాధీనం చేసుకుంటుందంటూ ట్రంప్ చేసిన ప్రతిపాదనపై ఆయన భిన్నస్వరం వినిపించారు. చర్చల్లో కేవలం జపోరిజియా మాత్రమే ప్రస్తావనకు వచ్చిందని తెలిపారు. తమ ఇంధన సదుపాయాలపై రష్యా ఎలాంటి దాడులు చేసినా దానికి దీటుగా స్పందనను చవిచూడాల్సి వస్తుందని హెచ్చరించారు.

**ఉక్రెయిన్‌వాసులపై ఉగ్ర అభియోగాలు**

తమకు బందీలుగా దొరికిన 23 మంది ఉక్రెయిన్‌వాసులపై ఉగ్రవాద అభియోగాల కింద రష్యా సైనిక న్యాయస్థానం 13 నుంచి 23 ఏళ్ల వరకు శిక్షలు విధించింది. ఇది సిగ్గుచేటైన విషయమని, అంతర్జాతీయ నియమాల ఉల్లంఘన కిందికి వస్తుందని ఉక్రెయిన్ మండిపడింది. 2022లో అజోవ్‌స్తల్ ఉక్కు పరిశ్రమలో పట్టుబడినవారిని, వివిధ పనులు చేసుకుని బతికేవారిని ఉగ్రవాదులుగా చూపించడం ఏమిటని రష్యాకు చెందిన మానవ హక్కుల సంస్థ 'మెమోరియల్' ప్రశ్నించింది.

# భూ భారతితో సమస్యలకు చరమగీతం

(మొదటిపేజీ తరువాయి)

సమాధానాలు ఇచ్చారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ.. ''2020లో భారాస హయాంలో ఎవరితోనూ సంప్రదించకుండానే.. ఓ నలుగురు నాలుగు గోడల మధ్య కూర్చుని రూపొందించిన రెవెన్యూ చట్టం, ధరణి పోర్టల్‌తో అనేక సమస్యలు ఏర్పడ్డాయి. భూ యజమానులకు వారి హక్కులపై అభద్రత ఏర్పడింది. ధరణిని ప్రక్షాళన చేస్తామని శాసనసభ ఎన్నికలకు ముందు ప్రకటించాం. చెప్పినట్లుగానే విదేశానికి చెందిన టెర్రా ఐసిస్ నుంచి స్వదేశీ సంస్థ ఎన్ఐసీకి పోర్టల్ బాధ్యతలు అప్పగించాం. ప్రజల అభిప్రాయాలు తీసుకునేందుకు కొత్త చట్టాన్ని పబ్లిక్ డొమైన్‌లో పెట్టాం. అందరి సలహాలు, సూచనలు స్వీకరించి ఈ ఏడాది జనవరి 4న భూ భారతి బిల్లు సభలో పెట్టి చట్టం చేశాం. చట్టం చేసి మూడు నెలలు కాక ముందే అన్ని అంశాలతో రూల్స్ రూపొందిస్తున్నాం. పక్షం రోజుల్లో నిబంధనలు సిద్ధమవుతాయి.

*** ధరణిని రిఫరెండంగా తీసుకుంటారా?**

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో భూభారతి చట్టాన్ని రెఫరెండంగా తీసుకుని పోటీ చేస్తాం. ధరణి చట్టాన్ని రెఫరెండంగా చూపి భారాస పోటీ చేయాలి. ప్రజలు ఎవర్ని ఆశీర్వదిస్తారో చూద్దాం. రాష్ట్రంలో ఎప్పటికైనా భూ సర్వే తప్పనిసరి అని ప్రభుత్వం గుర్తించింది. దీనిని దృష్టిలో పెట్టుకుని వ్యవసాయ, వ్యవసాయేతర భూములకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ సందర్భంగా సర్వే పటం జత చేయాలని కొత్త చట్టంలో నిబంధన పెట్టాం. రాష్ట్రంలో 10,954 రెవెన్యూ గ్రామాధికారులను నాటి ప్రభుత్వం రద్దు చేయగా మా ప్రభుత్వం పునరుద్ధరణ చేపట్టింది. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖలో పారదర్శకమైన సేవలను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు స్లాట్ విధానాన్నిఅమలు చేయనున్నాం. మొదట హైదరాబాద్, పరిసర ప్రాంతాల్లోని 17 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పైలట్ ప్రాజెక్టుగా స్లాట్ బుకింగ్ విధానాన్ని అమల్లోకి తీసుకొస్తాం. ఈ విధానంలో 15 నిమిషాల్లోనే రిజిస్ట్రేషన్ పూర్తవుతుంది. ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను గత ప్రభుత్వం స్వీకరించింది. ఏడాదిన్నర సమయం పక్కన పెట్టింది. మా ప్రభుత్వం ఉచితంగా చేస్తుందా.. లేదా.. అన్నది ప్రజలకు స్పష్టంగా తెలుసు. భారాస ప్రభుత్వం 2.50 లక్షల రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణాలకు టెండర్లు పిలిచినా 14 వేల వరకు గ్రౌండ్ కాలేదు. 1.72 లక్షల వరకు పనులు ప్రారంభించలేదు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో మొదటి విడతగా 4.50 లక్షల ఇళ్లను గత బడ్జెట్‌లోనే పెట్టాం. కొద్దిగా ఆలస్యమైన మాట వాస్తవమే. పునాదులు కూడా నిర్మించుకునే స్తోమత లేని వారికి మహిళా గ్రూపుల్లో పొదుపు సొమ్ము ఉంటే అనుసంధానం చేసి రూ.లక్ష సాయం అందించేలా నా నియోజకవర్గంలో ఏర్పాటు చేశా. మిగిలిన సభ్యులూ ఇలాంటి ప్రయత్నం చేయొచ్చు. సమాచార శాఖలో ప్రకటనల విషయంలో.. పదేళ్ల భారాస పాలనలో విచ్చలవిడిగా ప్రజల సొమ్మును లూటీ చేశారు. బయటి రాష్ట్రాల్లోనూ ప్రకటనలు ఇచ్చారు. ప్రింట్, ఎలక్ట్రానిక్, హోర్డింగ్‌లకు రూ.546 కోట్లను గత ప్రభుత్వం ఖర్చు చేసింది. పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియాకు ఇచ్చే టారిఫ్‌ల విషయంలోనూ ఇదే జరిగింది. పదేళ్లలో నాటి ప్రభుత్వం వారి సొంత వ్యవస్థకు ఎంత పెట్టిందో.. మిగతా వ్యవస్థలకు ఎంత పెట్టిందో సమయం ఇస్తే చర్చకు సిద్ధం'' అని పొంగులేటి పేర్కొన్నారు.

# పాస్టర్ ప్రవీణ్‌కుమార్ మృతిపై తీవ్ర ఉద్రిక్తత

(మొదటిపేజీ తరువాయి)

రాజమహేంద్రవరం: సువార్త ప్రసంగికుడు ప్రవీణ్‌కుమార్ పగడాల మృతిపై వివిధ క్రైస్తవ సంఘాల ఆందోళనలతో బుధవారం రాజమహేంద్రవరంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ప్రవీణ్ మృతిపై అనుమానాలున్నాయని, ప్రభుత్వం, పోలీసులు తమకు న్యాయం చేస్తామని స్పష్టమైన హామీ ఇచ్చేవరకు పోస్టుమార్టానికి వీల్లేదని క్రైస్తవ సంఘాల ప్రతినిధులు జీజీహెచ్ ఎదుట ఆందోళనకు దిగారు. చివరకు పోలీసులు నిరసనకారులతో చర్చించి, పోస్టుమార్టం పూర్తిచేసి, మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. సికింద్రాబాద్‌లో నివాసం ఉండే ప్రవీణ్‌కుమార్(45) తూర్పు గోదావరి జిల్లా చాగల్లులో జరిగే క్రైస్తవ సభలకు హాజరయ్యేందుకు సోమవారం సాయంత్రం బైక్‌పై బయల్దేరారు. మంగళవారం ఉదయం రాజమహేంద్రవరం సమీపంలోని కొంతమూరు వద్ద రోడ్డు పక్కన విగతజీవిగా పడి ఉన్న స్థితిలో ఓ కానిస్టేబుల్ గుర్తించారు. ఇది రోడ్డు ప్రమాదంగా భావించినప్పటికీ, ఈ ఘటనపై తమకు అనుమానాలున్నాయని కుటుంబసభ్యులు, క్రైస్తవ సంఘాలు తెలపడంతో పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదుచేశారు. మృతదేహాన్ని రాజమహేంద్రవరం జీజీహెచ్‌కు తరలించారు. హైదరాబాద్ నుంచి కుటుంబసభ్యులు చేరుకోనందున మంగళవారం పోస్టుమార్టం చేయలేదు.

*** రోజంతా ఆందోళనలు**

**అంబులెన్సులో జీజీహెచ్ నుంచి మృతదేహాన్ని బందోబస్తు మధ్య తరలిస్తున్న పోలీసులు**

ప్రవీణ్ మృతదేహానికి బుధవారం పోస్టుమార్టం చేసేందుకు సిద్ధంకాగా, వివిధ సంఘాల ఆందోళనలతో రోజంతా ఉద్రిక్తత నెలకొంది. తొలుత మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ ఆధ్వర్యంలో కొందరు ఆసుపత్రిలోని పోలీసు అవుట్ పోస్టు ఎదురుగా బైఠాయించారు. మతపెద్దలు సబ్బెళ్ల విజయప్రసాద్‌రెడ్డి, ప్రతాప్‌సిన్హా, సంజీవరావు, నగర ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ కూడా చేరుకున్నారు. జిల్లా ఎస్పీ నరసింహకిశోర్ మధ్యాహ్నం జీజీహెచ్‌కు వచ్చి ఆసుపత్రి వర్గాలు, క్రైస్తవ మతపెద్దలతో చర్చించారు. కుటుంబసభ్యుల సమక్షంలో వీడియో తీస్తూ పోస్టుమార్టం చేస్తామని చెప్పడంతో, మధ్యాహ్నం 2.30కు ప్రక్రియ ప్రారంభించారు. రెండున్నర గంటల పాటు పోస్టుమార్టం జరిగింది. అంతలోనే ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ రావడంతో పరిస్థితి మళ్లీ ఉద్రిక్తంగా మారింది. ఆయన్ను పోస్టుమార్టం ప్రాంతానికి అనుమతించారు. మృతదేహాన్ని అంబులెన్సులో హైదరాబాద్‌కు తరలిస్తుండగా, మళ్లీ కొందరు నినాదాలు చేస్తూ, వాహనాన్ని అడ్డుకున్నారు. ప్రభుత్వం సమాధానం చెప్పేవరకూ భౌతికకాయాన్ని కదలనివ్వమని నిలువరించారు. చివరకు పోలీసులు ఆందోళనకారులను చెదరగొట్టి, రోప్ పార్టీ సాయంతో జాతీయ రహదారి వైపు మళ్లించారు.

# అపచారం.. అపచారం..

(మొదటిపేజీ తరువాయి)

వచ్చాక గుర్తించింది. రెండు రోజుల క్రితం జరిగిన తితిదే బోర్డు సమావేశంలో ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు మాట్లాడుతూ, ఇకపై ఆ 'దాత' దానాలు అక్కర్లేదని, అతని సంస్థను బ్లాక్ లిస్టులో పెట్టామని చెప్పడంతో ఇన్నాళ్ల దారుణం వెలుగుచూసింది. వైకాపా పాలనలో శ్రీవారికి సమర్పించే ప్రసాదాల తయారీలో వాడే ముడి సరకులు, దినుసులన్నీ ప్రకృతి వ్యవసాయం ద్వారా ఉత్పత్తి అయినవే తీసుకోవాలని 2021లో నిర్ణయించారు. అమలాపురం ప్రాంతానికి చెందిన నిమ్మకాయల సత్యనారాయణ అనే రొయ్యల ఫీడ్ వ్యాపారి 'శ్రీనివాసా సేవా ట్రస్ట్' పేరుతో ఓ స్వచ్ఛంద సంస్థను తెరపైకి తెచ్చారు. తాను ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు తితిదేకు సరఫరా చేస్తానని ముందుకొచ్చారు. అయితే వాటిలో సాధారణ నిత్యావసరాలనూ కల్తీ చేసి సరఫరా చేశారు. తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు, ఏఈవో వెంకయ్యచౌదరి బాధ్యతలు చేపట్టాక వీటి నాణ్యతపై ల్యాబ్‌లో పరీక్షలు చేయించడంతో అక్రమాలు గుట్టు వీడింది.

# ఆగ్రాలో సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ ఇంటిపై దాడి

ఆగ్రా: సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) రాజ్యసభ ఎంపీ రాంజీ లాల్ సుమన్‌కు చెందిన ఆగ్రాలోని నివాసంపై బుధవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో దాడి జరిగింది. నగరంలోని హరిపర్వత్ చౌరస్తా సమీపంలోని రాంజీ లాల్ ఇంటి వెలుపల నిలిపి ఉంచిన కార్లు, ఇంటి కిటికీ అద్దాలు, కుర్చీలు ఈ ఘటనలో ధ్వంసమయ్యాయి. అక్కడ భద్రత విధుల్లో ఉన్న ఒక పోలీసు గాయపడ్డారు. పార్లమెంటులో ఇటీవల రాణా సంగా (సంగ్రామ సింగ్)పై రాంజీ లాల్ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా కర్ణి సేన కార్యకర్తలు ఈ దాడికి పాల్పడినట్లు తెలుస్తోంది. 16వ శతాబ్ద ప్రారంభంలో మేవార్ పాలకుడు, రాజ్‌పుత్‌ల ఆరాధ్యుడైన రాణా సంగాపై విమర్శలు చేసినందుకు గాను రాంజీ లాల్‌తో పాటు ఎస్పీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ క్షమాపణలు కోరాలని కర్ణి సేన డిమాండ్ చేస్తోన్న నేపథ్యంలో ఈ ఘటన జరిగింది. ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ బుధవారం ఆగ్రా పర్యటనలో ఉన్న సమయంలోనే ఎంపీ నివాసంపై దాడి జరగడాన్ని అఖిలేశ్ యాదవ్ ఖండించారు. రాష్ట్రంలో హింసను అడ్డుకుంటానని చెబుతున్న ముఖ్యమంత్రి తీసుకున్న చర్యలేమిటని సమాజ్‌వాదీ పార్టీ అధినేత ప్రశ్నించారు.

# అది అమానవీయ, క్రూరమైన అభిప్రాయం

(మొదటిపేజీ తరువాయి)

న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా ఆదేశాల మేరకు ఈ కేసును ధర్మాసనం సుమోటోగా స్వీకరించి బుధవారం విచారణ జరిపింది. హైకోర్టు జడ్జి గురించి తీవ్ర పదజాలాన్ని వినియోగించాల్సి రావడం పట్ల ధర్మాసనం విచారం వ్యక్తం చేసింది. మార్చి 17న అలహాబాద్ హైకోర్టు జడ్జి జస్టిస్ రామ్‌మనోహర్ నారాయణ్ మిశ్రా వివాదాస్పద తీర్పులోని పేరాలు 21, 24, 26లు న్యాయ సూత్రాలకు విరుద్ధమైనవని తెలిపింది. వీటిని ఉటంకిస్తూ ఇతర కేసుల్లో నిందితులకు ఉపశమనం కలిగించేలా న్యాయస్థానాలు ఉత్తర్వులివ్వరాదంటూ 'స్టే' విధించింది.

# అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలి

* **సీఎం రేవంత్ రెడ్డి కి వినతి పత్రం అందజేసిన ఎమ్మెల్యే కృష్ణారావు**



కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : కూకట్ పల్లి నియోజకవర్గం పరిధిలోని పలు ప్రాంతాలలో చేపట్టనున్న అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కోరారు. బుధవారం అసెంబ్లీ లోని ముఖ్యమంత్రి ఛాంబర్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ కూకట్ పల్లి నియోజకవర్గం లో పలు ప్రాంతాలలో నూతన రోడ్ల నిర్మాణం, మురుగునీటి వ్యవస్థ, తాగునీటి నూతన పైప్ లైన్ ల నిర్మాణం, పార్కులు, స్మశాన వాటికల నిర్మాణం (మిగిలిన పనులకు) సుమారుగా రూ.2530 కోట్ల నిధులను సత్వరం మంజూరు చేయాలని కోరారు. కూకట్ పల్లి మండలం పరిధిలోని హైదర్ నగర్ గ్రామం సర్వే నెంబర్ 145,163 లలో నిర్మాణ అనుమతులను నిలిపివేసి స్థానికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. దశాబ్దాల కాలంగా ఏ పార్టీ అధికారంలో ఉన్నా గానీ ప్రభుత్వపరమైన అన్ని అనుమతులను జారీ చేశారన్నారు. మున్సిపల్ అధికారులు రెవెన్యూ అధికారులపై, రెవెన్యూ అధికారులు మున్సిపల్ అధికారులపై నెపం వేస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న విషయం వివరించారు. జేఎన్టీయూ వెనుక ఉన్న సాయి నగర్ కాలనీ వాసుల ఇళ్ల స్థలాల రెగ్యులరైజేషన్ విషయంలో ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. 2014 కు ముందు ప్రభుత్వం నిర్ణయించిన ధరల మేరకు డబ్బులు చెల్లించేందుకు కాలనీ వాసులు సిద్ధంగా ఉన్నారని వారికి న్యాయం చేయాలని కోరారు. ఇటీవల కాలంలో అకస్మాత్తుగా నిర్మాణ అనుమతులను నిలిపివేశారని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. అన్ని విషయాలను వివరంగా తెలుసుకున్న ముఖ్యమంత్రి వినతి పత్రాలను సంబంధిత అధికారులకు పంపిస్తానని త్వరలోనే పరిష్కారం చూపుతానని హామీ ఇచ్చారు.

## వన్ నేషన్‌వన్ ఎలక్షన్ కార్యక్రమానికి మంచి స్పందన



శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని వివేకానంద నగర్ కాలనీలో పార్క్ 2 బిజెపి సీనియర్ నాయకులు భాస్కర్ రెడ్డి , మల్లికార్జున్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన వన్ నేషన్ వన్ ఎలక్షన్ అవగాహన కార్యక్రమానికి మంచి స్పందన లభించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా బిజెపి వి వి నగర్ డివిజన్ అధ్యక్షులు డాక్టర్ యన్. వంశీ రెడ్డి, వి వి డివిజన్ వన్ నేషన్ వన్ ఎలక్షన్ కన్వీనర్ తల్లోజు నరసింహ చారి లు పాల్గొని స్థానిక కాలని వాసులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు నర్సింగ్ రావు , రెప్పన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## రాజపేట తహసిల్దార్ గా అనిత బాధ్యతల స్వీకరణ



రాజపేట, ప్రజా స్ఫూర్తి : రాజపేట మండల తహసిల్దార్ గా సీసీఎల్ నుండి బదిలీపై వచ్చిన అనిత బుధవారం బాధ్యతల స్వీకరించారు. గత నెల 15వ తేదీన విధులు నిర్వర్తిస్తున్న దామోదర్ నకిలీ ఏసీబీ వారు బెదిరించగా వారికి రూ.2,80,000 లు ఆన్లైన్లో దామోదర్ కుమారుని ద్వారా పంపి బంగపడి, ఆరోపణలు ఎదుర్కోగా 18వ తేదీ సీసీఎల్ కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. దీంతో ఫిబ్రవరి 19వ తేదీ నుండి రాజపేట తహసిల్దార్ ఫుల్ అడిషనల్ చార్జిగా నాయబ్ తహసిల్దార్ వెంకటేశ్వర్లు రెడ్డి వ్యవహరిస్తున్నారు. సీసీఎల్ నుండి బదిలీపై వచ్చిన అనిత బుధవారం రాజపేట తహసిల్దారుగా బాధ్యతలు స్వీకరించారు.

## లయన్ నైనదేవికి "మహిళరత్న పురస్కారం 2025" అందజేసిన జస్టిస్ చంద్రయ్య



హైదరాబాద్, ప్రజాస్ఫూర్తి: ప్రముఖ సమాజ సేవకురాలు, రిటైర్డ్ డిప్యూటి కలెక్టర్ తార్నాక కు చెందిన లయన్ నైనాదేవి కి మహిళరత్న పురస్కారం 2025"ను రిటైర్డ్ జస్టిస్ చంద్రయ్య, ఢిల్లీ హైకోర్టు రిటైర్డ్ జస్టిస్ పి.యస్. నారాయణ చేతుల మీదుగా అందజేశారు. నైనాదేవి లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ఆదర్శ్ ట్రెజరరిగా ఉంటూ ఇటీవలనే లయన్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320ఎ కు తన సొంత ఖర్చులతో అత్యవసర వైద్య సేవల కోసం అంబులెన్ ను ఉచితంగా అందజేసి విద్య, వైద్యంలాంటి పలు సామాజిక సేవా చేస్తున్నారని అన్నారు. గత 10 సం.రాలుగా నిర్విరామంగా సేవలు అందిస్తున్న లయన్ నైనదేవి నిస్వార్థ సమాజ సేవలను గుర్తించి ప్రముఖ "సర్వేజనా:సుఖినోభవంతు" సామాజిక, సాహిత్య సేవ సంస్థ, హైదరాబాద్ 8వ వార్షికోత్సవ సందర్భంగా లయన్ నైనాదేవి కి మహిళరత్న పురస్కారం 2025 అందజేశారు. ఈ కార్యక్రమంలో క లయన్ డా.కె. మహేందర్ కుమార్ రెడ్డి, 1వ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ (డిస్ట్రిక్ట్ 320ఎ), లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320ఎ రిజియన్ 2 ఆర్.సి.పి. ఉమా శంకర్ రెడ్డి, లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ఆదర్శ్ చార్టర్ ప్రెసిడెంట్ లక్ష్మీ సోమయాజులు, సురేఖ సుజాత, సర్వేజనా:సుఖినోభవంతు" సామాజిక, సాహిత్య సేవ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు లయన్ డాక్టర్ ఎస్ సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి సూర్య తేజ సుబ్రాంత్ మాస్టర్, పలువురు నైనదేవి ని అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

## నిర్లక్ష్యంగా ఆటోలు నడిపి ప్రమాదాలకు కారకులవ్వద్దు

* **ముస్తాబాద్ ఎస్ఐ గణేష్**
* **ఆటో డ్రైవర్‌కు 2వేల రూపాయల జరిమానా**




ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్:నిర్లక్ష్యంగా ఆటోలు నడిపి ప్రమాదాలకు కారకులవ్వద్దని ముస్తాబాద్ ఎస్ఐ గణేష్ ఆటో డ్రైవర్లకు సూచించారు. పరిమితికి మించి పాఠశాల విద్యార్థులను ఆటోలో ఎక్కించుకుని నిర్లక్ష్యంగా ఆటో నడిపిన ముస్తాబాద్ మండలం గూడెం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ కొమిరె అభిషేక్‌కు 2వేల రూపాయల జరిమానా విధిస్తూ సిరిసిల్ల మొదటి ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ మంగళవారం తీర్పు ఇచ్చారని ఎస్ఐ తెలిపారు. ఆగస్టు 07, 2024న బ్లూ కోల్ట్ కానిస్టేబుల్ ఖాసీం పెట్రోలింగ్‌లో భాగంగా నామపూర్ గ్రామం ఎక్స్ రోడ్డు వద్దకు వచ్చే సరికి అతివేగంగా, నిర్లక్ష్యంగా గూడెం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ కొమిరె అభిషేక్ అనే వ్యక్తి ఆటోలో పరిమితికి మించి 16 మంది విద్యార్థులను ఎక్కించుకుని నడపడం వల్ల పాఠశాల పిల్లల ప్రాణాలకు హాని కలిగే ప్రమాదం ఉన్నదని ఆటో నడిపిన వ్యక్తిపై చట్ట ప్రకారం అవసరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేయగా ముస్తాబాద్ ఎస్ఐ గణేష్ కేసు నమోదు చేసి, కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. కేసు పూర్వపరాలు పరిశీలించిన న్యాయమూర్తి ప్రవీణ్ ఆటో డ్రైవర్‌కి 2వేల రూపాయల జరిమానా విధించినట్లు తెలిపారు. ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నియమాలు పాటిస్తూ, ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను, విద్యార్థులను ఎక్కించుకోవద్దని, పరిమితి మించి ఎక్కించుకుంటే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

## ప్రైవేట్ డిగ్రీ కళాశాల యాజమాన్యాలకు ఆర్టీఎఫ్ ,ఎంటిఎఫ్ బకాయిలు చెల్లించాలి



యాదాద్రి భువనగిరి , ప్రజాస్ఫూర్తి : తెలంగాణ రాష్ట్రంలో ప్రైవేట్ డిగ్రీ కళాశాల యాజమాన్యాలకు ఆర్టీఎఫ్ ,ఎంటిఎఫ్ బకాయిలు చెల్లించాలని ఉమ్మడి నల్గొండ జిల్లా ఫైనాన్స్ సెక్రటరీ చైర్మన్ శ్రీ సాయి కృప డిగ్రీ అండ్ పీజీ కళాశాల దరిపల్లి ప్రవీణ్ కుమార్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల తరఫున ప్రభుత్వం చెల్లించు ఫీజుల ద్వారా మాత్రమే నడపబడుతున్న డిగ్రీ కళాశాలకు గత నాలుగు సంవత్సరాలుగా ఆర్టిఎఫ్ ,ఎంటిఎఫ్ చెల్లించకపోవడం వలన, చాలామంది పేద విద్యార్థులు , యాజమాన్యాలు అనేక రకాల ఇబ్బందులకు గురి అవుతున్నారన్నారు. పేద మధ్యతరగతి పట్టభద్రులైన నిరుద్యోగ యువత స్థాపించుకున్నటువంటి డిగ్రీ కళాశాలలో విద్యార్థుల దగ్గర నుండి ఎటువంటి ఫీజులు వసూలు చేయవద్దన్నారు. విద్యార్థుల ఫీజు ఆర్టీఎఫ్ , ఏంటిఎఫ్ ద్వారా ప్రభుత్వమే చెల్లిస్తుందని చెప్పడం జరిగిందని, దానిని అనుసరించి విద్యార్థులకు ఉత్తమ బోధన గావిస్తూ అప్పులు చేసి ఆస్తులను అమ్మి తాము బతుకుతూ తమతోపాటుగా ఎంతోమందికి ఉపాధి కల్పిస్తున్న యాజమాన్యాలు విద్యార్థులకు విద్యాబోధన గావిస్తూ విద్యా సంవత్సరం పూర్తయినప్పటికిని ప్రభుత్వము ఆర్టిఎఫ్ , ఎంటీఎఫ్ లు చెల్లించకపోవడం వలన అనేకమంది విద్యార్థులు , యాజమాన్యాలు ఇబ్బందులకు గురి అవుతున్నారన్నారు. విద్యార్థులకు స్కాలర్ షిప్ రాకపోవడం వల్ల అధికంగా ఉన్న పరీక్ష ఫీజులను చెల్లించలేక విద్యను మధ్యలోనే వదిలి వేస్తున్నారన్నారు. భవన యజమానులు అద్దె వేధింపులు ఉద్యోగుల జీతాలు కొరకై ఒత్తిడి , వారి సహాయ నిరాకరణ ఇవే కాకుండా రోజు వారి ఖర్చులకు కూడా ఎంతో కష్టపడాల్సినటువంటి పరిస్థితులను కళాశాల యాజమాన్యాలకు ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. యాజమాన్యాలు ఆర్థిక భారంతో అప్పుల బాధతో కళాశాల నిర్వహించలేని పరిస్థితి నెలకొన్నదన్నారు. ఈ విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి ఆర్టీఎఫ్ , ఏంటిఎఫ్ బకాయిలు వెంటనే విడుదల చేయించి కళాశాల మనుగడను కొనసాగిన ప్రయత్నం చేయగలరని విన్నవిస్తున్నామన్నారు. ఈ సందర్భముగా రెవెన్యూ డివిజనల్ అధికారి భువనగిరి కి , డిప్యూటీ తాసిల్దార్ కోట్ల కళ్యాణ్ కి వేరువేరుగా ఫీజు రియంబర్స్మెంట్ విడుదల గురించి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మహాత్మా గాంధీ యూనివర్సిటీ పరిధి ఉమ్మడి నల్గొండ జిల్లా ఫైనాన్స్ సెక్రటరీ చైర్మన్ శ్రీ సాయి కృప డిగ్రీ అండ్ పీజీ కళాశాల దరిపల్లి ప్రవీణ్ కుమార్, శ్రీ నవ భారత్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ చిక్క ప్రభాకర్ గౌడ్ , పూల్ చంద్, జాగృతి డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ మణిపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## టిఆర్ఎస్వి యువజన నాయకుడు మోత్కుపల్లి బాలకృష్ణకు ఆర్థిక సహాయం



రాజాపేట, ప్రజాస్ఫూర్తి : ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటికి వచ్చిన మోత్కుపల్లి బాలకృష్ణ కి ఆలేరు మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్ బుధవారం రూ.5000 ల ఆర్థిక సాయం మండల అధ్యక్షుడు సట్టు తిరుమలేష్ ద్వారా అందజేశారు. ఈ సందర్భంగా బూడిద బిక్షమయ్య గౌడ్ కు మోత్కుపల్లి బాలకృష్ణ కృతజ్ఞతలు చెప్పారు. ఈ కార్యక్రమంలో బిఆరెస్ మండల పార్టీ మహిళ అధ్యక్షురాలు ఎడ్ల బాలలక్ష్మి, మండల పార్టీ సెక్రటరీ జనరల్ సందిల భాస్కర్ గౌడ్, ఆత్మ డివిజన్ చైర్మన్ మేక వెంకటేశ్వర రెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా నాయకులు మండల పార్టీ ఉపాధ్యక్షులు ఎర్ర గోకుల జస్వంత్, రాజపేట పట్టణ శాఖ అధ్యక్షులు బెడిదే వీరేశం, ముదిరాజ్ సంఘం మండల శాఖ అధ్యక్షులు పులి చంద్రమౌళి, ఉల్లి రమేష్‌గౌడ్, వరిమడ్ల బాలకృష్ణ, సుదం నవీన్ పాల్గొన్నారు.

## కెటిఆర్ సేన చేసేవన్నీ రియల్ ఎస్టేట్ దందాలే



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కెటిఆర్ సేన పేర చేసేవన్నీ రియల్ ఎస్టేట్ దందాలేనని బిజెపి మండల అధ్యక్షుడు మేర్గు అంజా గౌడ్, జిల్లా కార్యదర్శి మీస సంజీవ్ అన్నారు. బుధవారం బిజెపి పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. కెటిఆర్ పేరు మీద సైన్యం, సేన అనే టీమలు అనేవి ఏవీ లేవని, అలాంటి వాటితో తనకు ఎలాంటి సంబంధం లేదని స్వయంగా కెటిఆర్ గతంలో ప్రకటించారని గుర్తు చేశారు. అయిన ఒకప్పుడు కెకె సేన ఇప్పుడు కెటిఆర్ సేన పేరుతో కొందరు గుర్తింపు లేని వ్యక్తులు చలామణి అవుతున్నారని, వారి వ్యక్తి గత సంపాదన, దందాలేనని, అప్పుడేమో కెటిఆర్‌ను గాడిద మీద ఊరేగింపు చేసి రాక్షసుడు అని ఇప్పుడు రాక్షసుడు దేవుడు ఎలా అయ్యాడు ప్రశ్నించారు. బిఆర్ఎస్, టిఆర్ఎస్ అని చెప్పుకొని తిరిగే దమ్ము లేక ఇలా సేనల పేరిట పబ్లిసిటీ కోసం, వెక్కిలి చేష్టలు చేస్తే అన్ని రాజకీయ పార్టీలు వారి వ్యవహార శైలిని గమనిస్తున్నాయని, దమ్ముంటే కెటిఆర్ సేన నిజమే అని కెటిఆర్ అంగీకరిస్తాడా అని ప్రశ్నించారు. ఈ సమావేశంలో బిజెపి మండల ప్రధాన కార్యదర్శులు సొల్ల క్రాంతి కుమార్, బాధ నరేష్, చిట్నేని శ్రీనివాస రావు, మెంగని మహేందర్, గుండవేని తిరుపతి తదితరులున్నారు.

## వైభవంగా శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి కళ్యాణ మహోత్సవం



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు కె ఎస్ ఆర్ ముఖ్య అనుచరుడు మన్నే మహేష్ యాదవ్ శ్రీవీణ దంపతుల నివాసం నందు నిర్వహించిన అమ్మవారి కళ్యాణ మహోత్సవానికి మాజీ కార్పొరేటర్ కొలన్ తేజ శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు కె ఎస్ ఆర్ అభిమానులు ,సన్నిహితులు విచ్చేసి కళ్యాణాన్ని తిలకించి ధరించి అమ్మవారి ఆశీస్సులు పొందారు.

# గల్లీలో సిల్లీ లీడర్‌లా మాట్లాడుతున్న కేంద్ర మంత్రి బండి సంజయ్

* కేటీఆర్ సేన రాష్ట్ర అధ్యక్షులు మెంగని మనోహర్, బిఆర్ఎస్ పార్టీ యూత్ జిల్లా నాయకులు శీలం స్వామి
* కేంద్ర మంత్రి బండి సంజయ్‌పై ముస్తాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు







ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: గల్లీలో సిల్లీ లీడర్‌లా కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడు తున్నారని కేటీఆర్ సేన రాష్ట్ర అధ్యక్షులు మెంగని మనోహర్, బిఆర్ఎస్ పార్టీ యూత్ జిల్లా నాయ కులు శీలం స్వామి అన్నారు. మాజీ సిఎం కెసి ఆర్‌పై బండి ఆరోపణలు యావత్ తెలంగాణ ప్రజలను మనస్థాపానికి గురి చేసిందని అన్నారు. హైదరాబాద్‌లో కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావుపై నిరాధారమైన, వ్యక్తిగత ప్రతిష్టను, కుటుంబ విలువను దిగజార్చే అనుచిత వ్యాఖ్యలు చేయడంపై చట్టరిత్యా చర్యలు తీసుకోవాలని ముస్తాబాద్ ఎస్ఐ గణేష్‌కు బుధవారం వారు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధకులు, మాజీ సిఎం కేసీఆర్‌పై బీదర్‌లో దొంగనోట్ల ముద్రణ ప్రింటింగ్ చేసినట్టు, ఆ నోట్లను ఎన్నికల్లో పంపిణీ చేశారని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ చేసిన ఆరోపణలు కేసీఆర్ ప్రతిష్టను దిగజార్చే కుట్రలో భాగమని అన్నారు. ఉన్నత పదవులలో ఉన్నటువంటి వ్యక్తులు ఇలాంటి ఆరోపణలు, నిరాధారమైనటువంటి ఆరోపణలు చేయడం చూస్తే అర్థంపర్థం లేని వికృతమైన మాటలు సరికాదని, తను కేంద్ర మంత్రి అయినప్పటికీ కూడా ఇప్పటికీ తన మాట విధానంలో మార్పు రాలేదని, ఇలాంటి తప్పుడు మాటలు మాట్లాడితే రానున్న రోజులలో తెలంగాణ ప్రజలు బండి సంజయ్‌కి సరైన బుద్ధి చెప్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎండి. జహంగీర్, బైతి నవీన్, పుల్లూరి శ్రీనివాస్, కోడె శ్రీను, కేటీఆర్ సేన మండల అధ్యక్షుడు వంగూరి దిలీప్, ఉపాధ్యక్షుడు కరెడ్ల మల్లారెడ్డి, సురేష్, అనమేని వెంకటేష్, ఆంజనేయులు, మెంగని కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

## రంగారెడ్డినగర్ డివిజన్ లో పర్యటించిన కార్పొరేటర్



జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : కుత్బుల్లాపూర్ సర్కిల్ రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని రంగారెడ్డి నగర్, వెంకటరామిరెడ్డి నగర్, గాంధీనగర్ లలో స్థానిక కార్పొరేటర్ బి.విజయ్ శేఖర్ గౌడ్ బుధవారం స్థానిక నాయకులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్ లో గల రోడ్లు పనులు మంజూరు అయినందున మంజూరైన పాత రోడ్లన్నీ పరిశీలించి అధికారులకు వెంటనే పనులు ప్రారంభించాలని సూచించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సమిష్టి నిర్ణయాలతో ముందుకు సాగుదాం..



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం క్లబ్ నందు టియుడబ్ల్యూజె( ఐజెయు) నేషనల్ కౌన్సిల్ మెంబర్ సీనియర్ పాత్రికేయులు దుద్దుకూరి రామారావు ఆధ్వర్యంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఇమంది ఉదయ్ కుమార్ టియుడబ్ల్యూజె( ఐజెయు) సమావేశం నిర్వహించడం జరిగింది. ప్రస్తుతం జరుగుతున్న ఇళ్ల స్థలాలు, జర్నలిస్టుల సమస్యలపై పరిణామాలపై చర్చించడం జరిగింది. అనంతరం అందరం కలిసి సమిష్టి నిర్ణయంతో ముందుకు సాగాలని జర్న లిస్టుల ఇంటి స్థలాలు, తదితర సమస్యలపై పోరాటం చేసేందుకు తీర్మానం చేసుకోవడం జరిగింది.కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావుతో మాట్లాడిన అనంతరం కార్యాచ రణకు సిద్ధం కావాలని నిర్ణయించడం జరిగింది. ఈ కార్యక్ర మంలో టియుడబ్ల్యూజె (ఐజెయు) యూనియన్ జాతీయ నాయ కులు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, సీనియర్ నాయకులు, సీనియర్ జర్నలిస్టులు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా బాధ్యులు పాల్గొన్నారు.

## గంజాయి లేడీ డాన్ సంగీత సాహు అరెస్ట్

హైదరాబాద్: పలు గంజాయి కేసుల్లో నిందితురాలు.. గత కొన్ని రోజులుగా తప్పించుకొని తిరుగుతున్న గంజాయి లేడీ డాన్ సంగీత సాహును ఎక్సైజ్ ఎస్టీఎఫ్ పోలీసులు అరెస్టు చేశారు. ఒడిశాలోని కుర్థా జిల్లా కాళీకోట్ గ్రామానికి చెందిన సంగీత సాహు నాలుగేళ్ల క్రితం గంజాయి దందాలోకి దిగింది. భువనేశ్వర్‌కు దగ్గరగా ఉండటంతో అనేక రాష్ట్రాల గంజాయి వ్యాపారులతో మాట్లాడుతూ.. వారికి గంజాయి సరఫరా చేస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. గతంలో హైదరాబాద్‌లోని ధూల్‌పేటలో ఇద్దరికి 41.3 కేజీల గంజాయి సరఫరా చేస్తూ పట్టుబడింది. ధూల్‌పేటలో శీలాబాయ్, నేహాబాయ్, ఇష్కాసింగ్‌తో పాటు మరి కొందరికి గంజాయి సరఫరా చేసినట్టు పట్టుబడిన నిందితులు ఇచ్చిన వాం గ్మూలంతో ఆమెపై ఎక్సైజ్ పోలీసులు కేసులు నమోదు చేశారు.

## అప్పుడు అధికారంలో ఉంది ఎవరు

* నాడు అడ్డుపడ్డ వాళ్ళే నేడు నీతులు చెప్తున్నారు
* పాత్రికేయ సోదరులు అంతా గమనిస్తున్నారు
* టీపీసీసీ సభ్యులు నాగా సీతారాములు



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: గత 10 ఏళ్ళు అధికారంలో ఉంది ఎవరో అందరికి తెలుసని, అవకాశం ఉన్నప్పుడు కావాలని ఇళ్ల స్థలాలు ఇవ్వకుండా అడ్డుకున్న వాళ్లు జర్నలిస్టులను సభ్యసమాజాన్ని తప్పుదోవ పట్టించే విధంగా మాట్లాడడం వాళ్లకు హోదాకు తగదని టీపీసీసీ సభ్యులు నాగా సీతారాములు అన్నారు. మాజీ ఎమ్మెల్యే బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు జిల్లా వ్యాప్తంగా ఉన్న అందరూ జర్నలిస్టులకు ఒకే చోట ఇళ్ల స్థలం ఇచ్చే ఆలోచన చేస్తే జర్నలిస్ట్‌లకు ఇళ్ల స్థలం ఇచ్చిన క్రెడిట్ ఆయనకు దక్కుతుందని కొందరు అడ్డుకున్న విషయం జర్నలిస్ట్‌లు గుర్తు చేసుకోవాలన్నారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు నిర్దిష్ట ప్రతిపాదనలు చేస్తూ ఎలాంటి అభ్యంతరాలు రాకుండా జర్నలిస్టులకు స్థలాలను ఇచ్చి జర్నలిస్ట్ లకు న్యాయం చేసేందుకు ఇందిరమ్మ ప్రభుత్వం కట్టుబడి ఉందని, గతంలో జర్నలిస్టులకు ఇళ్లను ఇచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమే రాబోయే రోజుల్లో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వబోయేది కూడా కాంగ్రెస్ ప్రభుత్వమే అన్నారు. నిపుణుల సూచన మేరకు ముందుకెళ్దామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాటలను గుర్తు చేసిన ఆయన ఇందిరమ్మ రాజ్యంలో ఖచ్చితంగా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు వస్తాయని స్పష్టం చేశారు. 10 ఏళ్ళు అధికారంలో ఉన్న బిఆర్ఎస్ విలేకరులకు ఎం చేయకుండా నేడు విలేకరులు చేస్తున్న దీక్షల వద్ద కావాలనే ఇందిరమ్మ ప్రభుత్వంపై బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారని, అటువంటివాటిని జర్నలిస్ట్ మిత్రులు సభ్యసమాజం గమనిస్తుందన్నారు. అర్హులైన జర్నలిస్ట్ లకు ఇండ్ల స్థలాలు ఇచ్చేందుకు తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని భవిష్యత్ లో ఎటువంటి ఇబ్బంది లేకుండా ప్రతిపాదనలు చేసి అర్హులైన అందరికి ఇళ్ల స్థలంతో పాటు ఇంటి నిర్మాణానికి 5 లక్షలు కూడ ఇచ్చేలా సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరావు దృష్టికి తీసుకెళ్తానన్నారు.

## భద్రాచలంలో కూలిన ఆరంతస్తుల భవనం

* భవనం శిథిలాల కింద ఆరుగురు?
* అనుమతులు లేకుండా శిథిల భవనంపైనే నిర్మాణం..!







ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: ఆధ్యాత్మిక క్షేత్రమైన భద్రాద్రిలో నిర్మాణంలో ఉన్న ఆరు అంతస్తుల భవనం ఉన్నఫలంగా నేలమట్టమైంది. సదరు భవన శిథిలాల కింద ఆరుగురు ఉన్నట్లు సమాచారం. వారంతా మృతిచెంది ఉంటారని తెలుస్తోంది. కాగా ఎలాంటి అనుమతులు లేకుండా భవన నిర్మాణం సాగుతున్నట్లు తెలుస్తోంది. భద్రాచలం పంచాయతీ కార్యాలయానికి సమీపంలో ఈ భవనాన్ని ఓ ప్రైవేటు సేవా ట్రస్టు ఆధ్వర్యంలో నిర్మిస్తున్నట్లు తెలుస్తోంది. కాగా శిథిలావస్తకు చేరిన పాత భవనంపైనే మరో 5 అంతస్తుల నిర్మాణం చేయడం వల్ల ఈ ప్రమాదం సంభవించిందని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఒకవైపు నాణ్యత పాటించకపోవడం, మరోవైపు అధికారుల పర్యవేక్షణ లేకపోవడం, అనుమతులు లేకుండా నిర్మిస్తున్నా చర్యలు తీసుకోకపోవడం తదితర కారణాలతో ఆరుగురి ప్రాణాలు భవనాలశిథిలాల కింద చిక్కుకున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శిథిలాలను తొలగిస్తే తప్ప వారంతా ప్రాణాలతో ఉన్నారా లేదా అనే విషయం తెలిసే అవకాశం ఉంది. ఆరుగురితోపాటు ఇంకా ఎవరైనా శిథిలాల కింద చిక్కుకున్నారేమోననే సందేహం వ్యక్తమవుతోంది.

## ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్ యాప్‌లపై రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు

* 2021లో నిషేధం విధించినప్పటికీ సరైన చర్యలు తీసుకోలేదన్న ముఖ్యమంత్రి
* బెట్టింగ్ యాప్‌ల ఘటనలపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోందన్న రేవంత్ రెడ్డి
* బెట్టింగ్ యాప్‌లపై విచారణ కోసం ప్రత్యేక టీంను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడి

గేమింగ్, బెట్టింగ్ యాప్‌లపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్ యాప్‌లపై మాజీ మంత్రి హరీశ్ రావు లేవనెత్తిన అంశాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. ప్రభుత్వం 2021లో ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్ యాప్‌లపై నిషేధం విధించినప్పటికీ సరైన చర్యలు తీసుకోకపోవడం వల్ల ఇటీవల రాష్ట్రంలో పలు ఘటనలు చోటు చేసుకున్నాయని ముఖ్యమంత్రి అన్నారు. రాష్ట్రంలో గత కొద్దిరోజులుగా జరుగుతున్న ఘటనలపై కాంగ్రెస్ ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోందని అన్నారు. ఆన్‌లైన్ రమ్మీ వంటి ఇతర గేమ్‌ల నిరోధానికి, నిషేధానికి ప్రత్యేక విచారణ బృందాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. కొన్ని రోజులుగా ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లను ప్రమోషన్ చేసిన వారిపై కేసులు నమోదు చేసి విచారించామని, దీని వలన సమస్య పరిష్కారం కాదని అన్నారు. ఈ బెట్టింగ్ యాప్‌లను నిర్వహిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలంటే చాలామందిని విచారణ చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ఇందుకు ప్రభుత్వానికి అన్ని అధికారాలు కావాలని, ఈ బెట్టింగ్ యాప్‌లపై విచారణ జరిపేందుకు ప్రత్యేక విచారణ బృందాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని ఆయన తెలిపారు. ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లను నిర్వహిస్తున్న వారికి విధించే శిక్షను పెంచేందుకు వచ్చే సమావేశాల్లో సవరణ బిల్లును సభలో ప్రవేశపెడతామని ముఖ్యమంత్రి అన్నారు.

## నేడు కూకట్ పల్లి కోర్టు బార్ అసోసియేషన్ ఎన్నిక

కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : రాష్ట్ర బార్ కౌన్సిల్ ఆదేశాల మేరకు కూకట్ పల్లి కోర్టు బార్ సోసియేషన్ కు గురువారం ఎన్నికలు జరగనున్నాయి. ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు పోలింగ్ జరగనుండగా బార్ అసోసియేషన్ లో సభ్యత్వం కలిగిన 720 సభ్యులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. మొత్తం అధ్యక్ష ,ప్రధాన కార్యదర్శి, ఉపాధ్యక్షుడు, కార్యదర్శి, లైబ్రరీ సెక్రటరీ, లేడీ రిప్రజెంటేటివ్, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రెటరీ పదవితో సహా ఏడు కార్యవర్గ సభ్యుల పదవుల కోసం గాను 36 మంది బరిలో నిలిచారు. ఏడాది పదవీకాలంకు గాను ఆశావాహులు ఎవరికి వారుగా గెలిచేందుకు ముమ్మర ప్రచారం సాగిస్తున్నారు. ఓటర్లను ఆకట్టుకునేందుకు గత మూడు నాలుగు రోజులుగా గేట్ టూ గేదర్ కార్యక్రమాలు నిర్వహించడంతోపాటు తమకు అవకాశం కల్పిస్తే కోర్టులో పలు సౌకర్యాలు కల్పిస్తామని హామీలతో ఆకట్టుకునేందుకు ఒకరికి మించి మరొకరు ఎత్తులకు పై ఎత్తులు వేస్తూ సాధారణ ఎన్నికలను తలపిస్తుండడంతో సర్వ త్రా ఆసక్తి నెలకొంది.

## మూడు చింతలపల్లి తహాసీల్దారు కార్యాలయాన్ని సందర్శించిన అదనపు కలెక్టర్



మేడ్చల్ ప్రతినిధి, (ప్రజాస్ఫూర్తి) : మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా లోని మూడు చింతలపల్లి తహాసీల్దారు కార్యాలయాన్ని బుధవారం జిల్లా అదనపు కలెక్టరు విజయేందర్ రెడ్డి తనిఖీ చేసారు. ఈ సందర్భంగా ధరణిలో పెండింగ్ వివరాలపై అదనపు కలెక్టరు సమీక్ష నిర్వహించారు. ధరణిలో ఎన్ని పెండింగ్ ఉన్నాయని ఎంఆర్ఓ ను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ తొందరగా క్లియర్ చేయాలని కార్యాలయ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్ఓ నర్సింహారెడ్డి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## హైదరాబాద్ ఐపీఎల్ అభిమానులకు టీజీఎస్ఆర్టీసీ శుభవార్త

* ఉప్పల్ స్టేడియానికి ప్రత్యేక బస్సులు
* ఐపీఎల్ మ్యాచ్‌లు జరగనున్న తేదీల్లో బస్సులు
* 24 బస్సు డిపోల నుంచి 60 ప్రత్యేక బస్సులు



క్రికెట్ అభిమానులకు టీజీఎస్ఆర్టీసీ శుభవార్తను అందించింది. హైదరాబాద్‌లోని ఉప్పల్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ స్టేడియంలో జరిగే ఐపీఎల్ మ్యాచ్‌లను తిలకించేందుకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తోంది. వివిధ ప్రాంతాల నుంచి ఉప్పల్ స్టేడియానికి చేరుకోవడానికి గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని 24 బస్సు డిపోల నుంచి 60 ప్రత్యేక బస్సులను నడపనుంది. ఐపీఎల్ మ్యాచ్‌లు జరగనున్న తేదీల్లో ఈ సర్వీసులు అం దుబాటులో ఉంటాయి. ఉప్పల్ స్టేడియంలో రేపటి నుంచి మే 21వ తేదీ వరకు వివిధ తేదీల్లో మ్యాచ్‌లు జరగనున్నాయి. మార్చి 27, ఏప్రిల్ 6, 12, 23, మే 5, 10, 20, 21 తేదీల్లో మ్యాచ్‌లు ఉన్నాయి. ఘట్‌కేసర్, హయత్ నగర్, ఎల్బీనగర్, ఎన్జీవోస్ కాలనీ, కోఠి, లక్డీకాపూల్, దిల్‌సుఖ్ నగర్, మేడ్చల్, కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు, మియాపూర్, జేబీఎస్, చార్మినార్, బోయినపల్లి, చాంద్రాయణగుట్ట, మెహిదీపట్నం, బీహెచ్ఈఎల్ తదితర ప్రాంతాల నుండి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపనుంది.

# యోగి ఆదిత్యనాథ్ విమానం ఎమర్జెన్సీ ల్యాండింగ్!

ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ప్రయాణిస్తున్న ఛార్టెడ్ విమానంలో సాంకేతిక సమస్య తలెత్తింది. దీంతో ఆగ్రాలోని ఖేడియా విమానాశ్రయంలో అత్యవసర ల్యాండింగ్ అయ్యింది. ఆగ్రా పర్యటనలో ఉన్న సీఎం యోగి ఆదిత్యనాథ్.. మధ్యాహ్నం



3.40కు పర్యటన ముగించుకొని బయలుదేరారు. విమానం టేకాఫ్ అయిన 20 నిమిషాలకు సాంకేతిక సమస్య తలెత్తిందని గుర్తించిన పైలట్లు.. వెంటనే వెనక్కి మళ్లించారు. ముందు జాగ్రత్త చర్యగా ఖేడియా ఎయిర్‌పోర్టులో దించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఢిల్లీ నుంచి మరో విమానాన్ని పిలిపించారు. అది వచ్చేవరకు దాదాపు గంటన్నరకు పైగా సీఎం యోగి ఆగ్రా ఎయిర్‌పోర్టు లాంజ్‌లోనే వేచి ఉన్నట్లు తెలిసింది. చివరకు మరో విమానం రావడంతో లఖ్‌నవూ బయలుదేరి వెళ్లినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి.

## క్షిపణి పరీక్ష..
## 32 వేల మంది సురక్షిత ప్రాంతాలకు తరలింపు

బాలాసోర్: ఒడిశాలోని చాందీపుర్ ప్రాంతంలోని ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ నుంచి క్షిపణి పరీక్ష నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో సమీపంలోని గ్రామాలలో నివసిస్తున్న సుమారు 32,000 మంది ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ అధికారులు తెలిపారు. ఐటీఆర్ లాంచ్ ప్యాడ్ 3 నుంచి దగ్గరగా ఉన్న ఆరు గ్రామాల ప్రజలను బుధవారం



తెల్లవారుజామున సమీపంలోని మూడు ప్రభుత్వ కేంద్రాలకు తరలించినట్లు పేర్కొన్నారు. క్షిపణి పరీక్షలు ముగిసే వరకు ప్రజలు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాలలో ఉండాలని సూచించింది. వారి వసతి, ఇతర అవసరాలకు అనుగుణంగా తగిన ఏర్పాట్లు చేసినట్లు పేర్కొంది. ప్రజల అవసరాలు, బాగోగులు చూడడానికి వంద మందికిపైగా ప్రభుత్వ సిబ్బందిని నియమించినట్లు తెలుస్తోంది.

## త్వరలో మీ పార్టీ మూసుకోవాల్సి వస్తుంది

**: కునాల్ వ్యాఖ్యల వివాదంపై శిందే**

స్టాండప్ కమెడియన్ కునాల్ కామ్రా చేసిన వ్యాఖ్యలపై మహారాష్ట్ర డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ శిందే మరోసారి స్పందించారు. ఎవరిదగ్గరో తీసుకున్న సుపారీ కారణంగానే తనపై వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. బుధవారం అసెంబ్లీలో మాట్లాడుతూ.. ''మీరు నన్ను పదేపదే గద్దార్, గద్దార్ అని పిలుస్తున్నారు. త్వరలో మీరు మీ పార్టీ తలుపులు మూసివేయాల్సి ఉంటుంది. ఎన్నికల సంఘం, సుప్రీంకోర్టు, స్పీకర్‌తో పాటు ఎన్నికల్లో ప్రజలు తీర్పు చెప్పారు. మీరు ఎంత సుపారీ ఇచ్చినా.. అది పనిచేయదు'' అని శివసేన(యూబీటీ)ని ఉద్దేశించి ఘాటుగా విమర్శలు చేశారు. ఇటీవల ముంబయిలోని యూనికాంటినెంటల్ హోటల్‌లోని హాబిటాట్ కామెడీ స్టూడియోలో కునాల్ కామ్రా హాస్య వినోద కార్యక్రమం నిర్వహించి దానిని రికార్డు చేశారు. ఇందులో మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందేను ''గద్దార్'' (ద్రోహి) గా అభివర్ణిస్తూ 'దిల్‌తో పాగల్ హై' హిందీ చిత్రంలోని ఒక సినీ గీతానికి పేరడీని కామ్రా ఆలపించడం ఈ వివాదానికి కారణమైంది. ఉప ముఖ్యమంత్రిపై



అవమానకర వ్యాఖ్యలు చేశారన్న కారణం చూపుతూ పోలీసులు ఆయనపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఆ వ్యాఖ్యలకు నిరసనగా హాబిటాట్ స్టూడియోపై శివసేన కార్యకర్తలు దాడి చేశారు. ఈ పరిణామాలపై మంగళవారం మీడియాతో మాట్లాడుతూ శిందే స్పందించారు. ''ఇలాంటి పనులు చేయడానికి ఆయన (కునాల్) ఎవరి నుంచి సుపారీ తీసుకున్నారు. ప్రజాస్వామ్యంలో స్వేచ్ఛ ముఖ్యం. కానీ వేరే వారి తరఫున ఇతరుల గురించి తప్పుగా మాట్లాడటం సరికాదు. నా గురించి మర్చిపోండి.. ప్రధాని మోదీ, ఆర్థిక మంత్రి, హోం మంత్రి గురించి ఏం మాట్లాడారో చూడండి. అలాగే నేను విధ్వంసాన్ని సమర్థించను'' అని శిందే అన్నారుశిందేపై స్టాండప్ కమెడియన్ కునాల్ కామ్రా చేసిన పేరడీపై వివాదం కొనసాగుతున్న విషయం తెలిసిందే. దీనిపై విచారణలో భాగంగా పోలీసులు సమన్లు జారీ చేస్తున్న సమయంలోనే కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ని ఉద్దేశిస్తూ కునాల్ మరో పాట పాడారు. 'మిస్టర్ ఇండియా' సినిమాలోని హవా హవాయి పాటను పేరడీ చేసిన ఆయన.. పన్ను చెల్లింపుదారుల సొమ్ము వృథా అవుతోందంటూ అందులో ఆరోపించారు.

## ఎమ్మెల్యే బసనగౌడకు భాజపా షాక్..
## ఆరేళ్లు బహిష్కరణ వేటు

బెంగళూరు: కర్ణాటక భాజపా ఎమ్మెల్యే బసనగౌడ పాటిల్ యత్నాళ్‌పై ఆ పార్టీ బహిష్కరణ వేటు వేసింది. ఆరేళ్ల పాటు పార్టీ ప్రాథమిక సభ్యత్వం నుంచి బహిష్కరించినట్లు తెలిపింది. ఈ నిర్ణయం తక్షణమే అమల్లోకి వస్తుందని పేర్కొంటూ భాజపా కేంద్ర క్రమశిక్షణ కమిటీ ఆయనకు లేఖ రాసింది. పార్టీతో పాటు మాజీ సీఎం బీఎస్ యడియూరప్పకు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలతో ఫిబ్రవరి 10న షోకాజ్ నోటీసులు జారీ చేసిన భాజపా.. తాజాగా ఆయనపై కఠిన చర్యలు తీసుకుంది. బసనగౌడ రియాక్షన్ ఇదే.. పార్టీ నుంచి తనను బహిష్కరించడంపై ఎమ్మెల్యే బసనగౌడ స్పందించారు. వారసత్వ రాజకీయాలు, అవినీతికి వ్యతిరేకంగా మాట్లాడినందుకు, పార్టీలో సంస్కరణలు, వ్యక్తుల ఆధిపత్యాన్ని తొలగించాలని, ఉత్తర కర్ణాటకను అభివృద్ధి చేయాలని



అడిగినందుకు తనను ఆరేళ్ల పాటు పార్టీ నుంచి బహిష్కరించారని ఆరోపించారు. ముక్కుసూటిగా మాట్లాడినందుకు ఇది పార్టీ తనకు ఇచ్చిన రివార్డుగా పేర్కొన్నారు. అవినీతి, కుటుంబ రాజకీయాలకు వ్యతిరేకంగా, ఉత్తర కర్ణాటక అభివృద్ధి, హిందుత్వ కోసం తన పోరాటం కొనసాగుతుందన్నారు. ఇదే ఉత్సాహం, దృఢ సంకల్పంతో ప్రజాసేవ చేస్తానని, తనకు అండగా నిలిచిన అందరికీ కృతజ్ఞతలు తెలుపుతూ 'ఎక్స్'లో పోస్టు పెట్టారు.

## సభలో నన్ను మాట్లాడనివ్వట్లేదు

*: రాహుల్ గాంధీ విమర్శలు!*

దిల్లీ: లోక్‌సభలో తనను మాట్లాడేందుకు అనుమతించడంలేదని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. సభా కార్యకలాపాలు సజావుగా సాగేందుకు మాత్రం ఇది సరైన మార్గం కాదన్నారు. ఏం జరుగుతోందో తనకు తెలియడంలేదని.. మాట్లాడేందుకు అనుమతి కోరినా ఇవ్వడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిపక్ష నాయకుడికి సభలో ప్రసంగించే అవకాశం ఇవ్వడం సంప్రదాయమని గుర్తు చేశారు. బుధవారం లోక్‌సభ వాయిదా అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ''నేను ఎప్పుడు లేచి నిలబడినా మాట్లాడేందుకు అనుమతించడం లేదు. మేం చెప్పాలనుకొనే అంశాలను లేవనెత్తేందుకు మాకు అనుమతి ఇవ్వడంలేదు. నేనేమీ చేయలేదు. ఒక్కమాట కూడా మాట్లాడకుండా కూర్చున్నా. ఏడెనిమిది రోజుల నుంచి నన్ను మాట్లాడేందుకు అనుమతించట్లేదు. ఇదో కొత్త ఎత్తుగడ. ప్రతిపక్షానికి ఇక్కడ చోటులేదు. ఇటీవల ప్రధాని కుంభమేళా గురించి మాట్లాడినప్పుడు నేను నిరుద్యోగం గురించి మాట్లాడాలనుకున్నా.. కానీ మాట్లాడేందుకు అనుమతించలేదు. మమ్మల్ని మాట్లాడేందుకు అనుమతించక



పోవడం అప్రజాస్వామికం'' అని రాహుల్ అన్నారు. మరోవైపు, బుధవారం సభా కార్యకలాపాల సమయంలో స్పీకర్ ఓం బిర్లా మాట్లాడుతూ.. సభా గౌరవాన్ని కాపాడేందుకు నిబంధనలు పాటించాలని సూచించారు. సభలోని సభ్యులు హుందాగా వ్యవహరించాలన్నారు. సభ్యుల ప్రవర్తన ఈ సభ ఉన్నత ప్రమాణాలకు అనుగుణంగా లేదని అనేక సందర్భాల్లో తన దృష్టికి వచ్చినట్లు తెలిపారు. ఈ సభలో తండ్రీ కూతురు, తల్లీ కుమార్తె, భార్యా భర్తలు సభ్యులుగా ఉన్నారు. ఇలాంటి సందర్భంలో ప్రతిపక్ష నేత 349 రూల్ (సభలో సభ్యులు పాటించాల్సిన ప్రవర్తనా నియమావళిని సూచించే నిబంధన) ప్రకారం నడుచుకుంటారని తాను ఆశించినట్లు తెలిపారు.

## అసెంబ్లీకి రారు గానీ..
## సోషల్ మీడియాలో మాత్రం యాక్టివ్

**: గహ్లోత్‌పై సీఎం విమర్శలు**

జైపూర్: కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ సీఎం అశోక్ గహ్లోత్‌పై రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ విమర్శలు గుప్పించారు. ప్రజా సమస్యలపై దృష్టి సారించడానికి బదులుగా 'ఎక్స్'లో పోస్టులపై ఫోకస్ పెట్టారని ఆరోపించారు. బికనేర్‌లో జరిగిన ఓ రైతు సదస్సులో సీఎం మాట్లాడారు. అశోక్ గహ్లోత్ అసెంబ్లీ సమావేశాలకు ఒక్కరోజు కూడా హాజరు కావడం లేదు గానీ.. 'ఎక్స్'లో మాత్రం క్రియాశీలంగా ఉంటున్నారన్నారు. ఆ పోస్టులతో హెడ్‌లైన్స్‌లో నిలవాలని కోరుకొంటున్నారని ఆరోపించారు. ''ఎక్స్'లో ఏదైనా పోస్టు చేసే ముందు మీ ట్వీట్లు ఒకసారి చూసుకోండి. గత ఐదేళ్లలో మీరు అధికారంలో ఉన్న సమయంలో ప్రజల కోసం ఏం చేశారో చూడండి. సామాజిక మాధ్యమాల్లో పోస్టులు చేస్తే సరిపోదు. ప్రజల మధ్యకు వెళ్లి వారి బాధల్ని




అర్థం చేసుకోవాలి. వాటిని పరిష్కరించడం ప్రభుత్వ విధి' అన్నారు. కాంగ్రెస్‌కు చెందిన ఓ యువ నేత రైతుల వద్దకు వచ్చి రుణాలను పూర్తిగా మాఫీ చేస్తానని హామీ ఇచ్చినా.. అది జరగలేదంటూ ఆ నేత పేరు ప్రస్తావించకుండా విమర్శలు చేశారు. బంగాళాదుంపల నుంచి బంగారం తయారు చేయడం గురించి సదరు నేత మాట్లాడారన్నారు. రాజస్థాన్ రైతులకు నీరు సరిగా అందితే.. కచ్చితంగా రైతులు భూమి నుంచి బంగారం పండిస్తారన్నారు.

*** పాత ట్వీట్‌తో గహ్లోత్ కౌంటర్**

సీఎం భజన్‌లాల్ శర్మ వ్యాఖ్యలకు మాజీ సీఎం అశోక్ గహ్లోత్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. కనీస మద్దతు ధరకు పంటలను సేకరించాలని గతంలో కాంగ్రెస్ సర్కార్‌కు భజన్‌లాల్ చేసిన డిమాండ్‌కు సంబంధించిన పాత ట్వీట్‌ను ఈ సందర్భంగా గుర్తు చేశారు. ''కాంగ్రెస్ ప్రభుత్వం ఎంఎస్‌పీపై చిరుధాన్యాలు కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ దాదాపు రెండున్నరేళ్ల క్రితం చేసిన మీ ట్వీట్‌ను మీకు గుర్తు చేయాలనుకుంటున్నా. ఇప్పుడు మీ ప్రభుత్వం ఒకటిన్నరేళ్లు పూర్తి చేసుకోబోతోంది. మీ మ్యానిఫెస్టోలో ఎంఎస్‌పీ ధరపై చిరుధాన్యాలు కొంటామని హామీ ఇచ్చారు కదా.. మరి ఎప్పుడు కొనుగోలు ప్రారంభిస్తారో చెప్పండి'' అని గహ్లోత్ నిలదీశారు.

## తప్పుదోవ పట్టించే ప్రకటనలు.. రాష్ట్రాలకు 'సుప్రీం' కీలక ఆదేశాలు

తప్పుదారి పట్టించే ప్రకటనలు సమాజానికి తీవ్ర హాని చేస్తాయని భారత సర్వోన్నత న్యాయస్థానం పేర్కొంది. ఈ విషయానికి సంబంధించి 'ఫిర్యాదుల పరిష్కార యంత్రాంగాన్ని' ఏర్పాటు చేయాలని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను ఆదేశించింది. రెండు నెలల్లోగా ఈ మేరకు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది.డ్రగ్స్ అండ్ మ్యాజిక్ రెమిడీస్ యాక్టు 1954 కింద నిషేధించిన ప్రకటనలకు సంబంధించి అభ్యంతరాలపై ప్రజలు ఫిర్యాదు చేసేందుకు అవసరమైన యంత్రాంగాన్ని రాష్ట్రాలు రూపొందించాలని జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన సుప్రీం ధర్మాసనం పేర్కొంది.






# ఆదివాసీ అందం ఢోక్రా!

**ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలు ప్రత్యేకంగా ఉంటాయి. కొండకోనల్లో జీవించే గిరిజనులకు వనమంటే ప్రాణం. వారి జీవనవిధానంలో సహజ సౌందర్యం ప్రతిబింబిస్తుంది. ముఖ్యంగా ఈ అడవి బిడ్డలు ధరించే ఆభరణాలు.. ప్రకృతి సోయ'గాలాలు' వేస్తాయి! ఈ ఆభరణాల్లో ఒక్కో తెగవి ఒక్కో శైలిలో ఉంటాయి. వేటికవే ప్రత్యేకతను కలిగి ఉంటాయి. ఆధునిక అతివలను తెగ ఆకట్టుకుంటున్న ఢోక్రా ఆదివాసీ ఆభరణాల ముచ్చట్లు ఇవి..**




ఢోక్రా నగలు భారతదేశంలోని ప్రాచీన కళారూపాలలో ఒకటి. వీటిది శతాబ్దాల చరిత్ర. ఈ నగలు సింధు నాగరికతలోనూ మనగడలో ఉన్నాయని చెబుతారు. తరతరాలుగా గిరిజనులు ఈ కళారూపాలను కాపాడుకుంటూ వస్తున్నారు. ప్రకృతి అందాలు, జంతువులు, పక్షులు, ఆదివాసీ దేవతల ఆకృతులు ఈ నగల్లో నిగనిగలాడుతూ ఉంటాయి. చేతులతో తీర్చిదిద్దిన ఈ ఆభరణాల్లో అణువణువూ అద్భుతం అనిపిస్తుంది. వీటిని సాధారణంగా కంచు, ఇత్తడితో తయారుచేస్తారు.

లాస్ట్ వాక్స్ టెక్నిక్‌ను ఉపయోగించి కళాకారులు వీటిని తయారుచేస్తారు. ఈ పద్ధతిలో మొదట మైనంతో అచ్చు (మోల్డ్) తయారుచేసి దాని చుట్టూ మట్టి పూత పూస్తారు. తర్వాత మైనాన్ని కరిగిస్తారు. దాని స్థానంలో కంచు లేదా ఇత్తడిని కరిగించి పోసి నగకు ఓ రూపం తెస్తారు. ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఝార్ఖండ్, తెలంగాణ తదితర రాష్ట్రాల్లోని గిరిజన కళాకారులు వీటిని రూపొందిస్తున్నారు. ఇదే పద్ధతిలో ఇప్పుడు స్వచ్ఛమైన బంగారం, వెండి, ప్లాటినం లాంటి ఖరీదైన లోహాలతో తయారైన నగలు కూడా మార్కెట్లో అందుబాటులోకి వచ్చాయి.

ఢోక్రా ఆభరణాలు ప్రకృతి అందాలను, సంస్కృతిని ప్రతిబింబిస్తాయి. సూర్యచంద్రులు, రాధాకృష్ణులు, చెట్లు, జంతువుల ఆకారాలు పొదిగిన హారాలు, వంకీలు, కంకణాలు, కమ్మలు, పట్టీలు.. ఇలా రకరకాల నగలు ఇందులో అందుబాటులో ఉన్నాయి. పర్యావరణ అనుకూలమైన ఢోక్రా నగలు ఆధునిక ఫ్యాషన్‌కు ఏమాత్రం తీసిపోవు. సంప్రదాయ దుస్తులతోపాటు ట్రెండీవేర్ పైకీ ఇట్టే నప్పుతాయి. నలుగురిలో ప్రత్యేకంగా నిలవాలనుకునేవారికి ఈ ఆభరణాలు సరైన ఎంపిక. ఇంకెందుకు ఆలస్యం.. మీరూ ట్రై చేయండి!

---

**వాన వెలిసిన తర్వాత వాతావరణం ఆహ్లాదకరంగా మారుతుంది. ఈ సమయం.. ఫొటోగ్రఫీకి అనుకూలంగా ఉంటుంది. ఇక రోడ్లపై నిలిచిన వాననీటిలో.. భవనాలు, చెట్ల ప్రతిబింబాలు ప్రత్యేకంగా కనిపిస్తుంటాయి. వాటిని కెమెరాల్లో బంధించడమే.. 'రిఫ్లెక్షన్ ఫొటోగ్రఫీ'. నీళ్లు, గాజు, అద్దాలు, పాలిష్ చేసిన ఉపరితలాలను ఉపయోగిస్తూ.. అద్భుతమైన చిత్రాలు తీసే సృజనాత్మక కళ. మొబైల్ ఫోన్‌తో.. ప్రొఫెషనల్ గేర్ అవసరం లేకుండానే.. అద్భుతమైన రిఫ్లెక్షన్ ఫొటోలను తీయవచ్చు. మీ స్మార్ట్‌ఫోన్‌ని ఉపయోగించి రిఫ్లెక్షన్ ఫొటోగ్రఫీలో నైపుణ్యం సాధించడానికి కావాల్సిన చిట్కాలు, పద్ధతులను ఈ ఎపిసోడ్‌లో తెలుసుకుందాం.**



## ప్రతిబింబాలతో మాయ..

# మొబైల్ ఫోన్‌తో రిఫ్లెక్షన్ ఫొటోగ్రఫీలో అద్భుతాలు





### మొబైల్ కెమెరా'నే ఎందుకు?

పోర్టబుల్ : ఎక్కడికైనా సులభంగా తీసుకెళ్లవచ్చు. ఆకస్మికంగా ఫొటో తీయాలనుకుంటే.. వెంటనే జేబులోంచి తీసి 'క్లిక్' అనిపించొచ్చు.

**ఫాస్ట్- ఫ్లెక్సిబుల్ :**

మొబైల్ కెమెరాలతో లైటింగ్, యాంగిల్స్‌ను త్వరత్వరగా అడ్జస్ట్ చేసుకోవచ్చు.

**క్రియేటివ్ యాంగిల్స్ :**

స్మార్ట్‌ఫోన్లను వాడటం చాలా సులువు. రిఫ్లెక్షన్ ఫొటోగ్రఫీలో ఎక్కువగా 'లో యాంగిల్'.. అంటే కింద కూర్చుని ఫొటోలు తీయాల్సి ఉంటుంది. అలాంటి సమయంలో స్మార్ట్‌ఫోన్ కంఫర్ట్‌గా ఉంటుంది. దీని సాయంతో క్లోజ్‌అప్ షాట్‌లను సులభంగా తీయవచ్చు.

**ప్రొటిప్ :**

మరింత డ్రమాటిక్ రిఫ్లెక్షన్ ఫొటోల కోసం మంచి అల్ట్రావైడ్‌లెన్స్ ఉన్న మొబైల్ ఫోన్‌ని ఉపయోగించండి.

1. ఉత్తమమైన రిఫ్లెక్టివ్ సర్ఫేస్‌లు అద్భుతమైన ప్రతిబింబాలను ఫొటో తీయడానికి..

నీరు (సరస్సులు, నీటి కుంటలు, కొలనులు) : గుట్టలు, కొండలకు సహజసిద్ధమైన రిఫ్లెక్షన్స్ అందిస్తాయి.

గ్లాస్ కిటికీలు, ఆకాశ హర్మ్యాలు : నగరాలు, భవనాల ప్రతిబింబాలను అద్భుతంగా చూపిస్తాయి.

అద్దాలు : పోర్ట్రెయిట్‌లు, సృజనాత్మక కంపోజిషన్స్ కోసం ఉపయోగపడతాయి.

మెరిసే భవనాలు, టైల్స్ : ఇండోర్ సెట్టింగ్‌లలో ఇల్యూజన్స్ కోసం పనికొస్తాయి.

కారు ఉపరితలాలు, మెటల్ వస్తువులు : వీటిలో నగర దృశ్యాలు, వీధుల ప్రతిబింబింబాలను మరింత అందంగా ఫొటోలు తీయొచ్చు.

ప్రొ టిప్ : వర్షం తర్వాత రోడ్లపై నిలిచే నీరు.. అందమైన ప్రతిబింబాలను సృష్టిస్తాయి. కాబట్టి.. వర్షం వెలిశాక తడి వీధుల్లో విహరించండి. అద్భుతమైన ఫొటోలను తీయండి.

### 2. కెమెరా సెట్టింగ్‌లు

ఫోకస్ : మీకు కావాల్సిన రిఫ్లెక్షన్ ఆబ్జెక్ట్ స్పష్టంగా ఉండేలా చూసుకోండి.

**ఎక్స్‌పోజర్ :**

ఫొటోలు ఓవర్ ఎక్స్‌పోజ్ కాకుండా ఉండేందుకు ఎక్స్‌పోజర్‌ను అడ్జస్ట్ చేయండి.

హెచ్‌డీఆర్ మోడ్ : అధిక కాంట్రాస్ట్ ఉండే ప్రాంతాలలో.. లైట్స్, షాడోస్‌ని బ్యాలెన్స్ చేసేందుకు హెచ్‌డీఆర్ మోడ్‌ను ఉపయోగించండి.

**గ్రిడ్ లైన్లు :**

రిఫ్లెక్షన్లను సమరూపంగా అమర్చడంలో ఇవి సహాయపడతాయి.

అల్ట్రా వైడ్ మోడ్ : ఈ మోడ్.. దృశ్యాన్ని మరింత విస్తరిస్తుంది. ప్రతిబింబాలను మరింత నాటకీయంగా మారుస్తుంది.

### 3. లైటింగ్ టెక్నిక్స్..

గోల్డెన్ అవర్ : సూర్యోదయం, సూర్యాస్తమయంలో ఉండే మృదువైన లైటింగ్.. ప్రతిబింబాల అందాన్ని పెంచుతుంది.

బ్లూ అవర్ : సూర్యాస్తమయం తర్వాత మెరుస్తున్న నగర లైట్లతో.. అర్బన్ రిఫ్లెక్షన్స్‌ను అద్భుతంగా బంధించొచ్చు.

మేఘాలు : ఆకాశంలో దట్టంగా కమ్ముకునే మేఘాలు.. ప్రకృతిని కొత్తగా చూపిస్తాయి. రిఫ్లెక్షన్లు ఓవర్ ఎక్స్‌పోజర్ కాకుండా చూస్తాయి.

నైట్ రిఫ్లెక్షన్స్ : నగరాల్లో నదులు, సరస్సుల (మూసీ, హుస్సేన్‌సాగర్) లో కనిపించే భవనాలు, సిటీ లైట్లు, నియాన్ రిఫ్లెక్షన్లను క్యాప్చర్ చేయండి.

ప్రొ టిప్ : క్రియేటివ్ నైట్ రిఫ్లెక్షన్స్ కోసం కృత్రిమ లైట్లను (వీధిదీపాలు, నియాన్ సంకేతాలు) ఉపయోగించండి.

మొబైల్ ఫోన్‌తో అద్భుతమైన రిఫ్లెక్షన్ ఫొటోగ్రఫీని ఆస్వాదించండి. మరింత క్రియేటివ్‌గా ఆలోచిస్తూ.. విభిన్న ఉపరితలాలు, లైటింగ్, యాంగిల్స్‌తో సరికొత్త ప్రయోగాలు చేయండి. ప్రత్యేకంగా కనిపించే, కంటికి ఆకట్టుకునే కంపోజిషన్స్‌ని సృష్టించండి.

## వరుస లాభాలకు బ్రేక్..

### భారీ నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు..



**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు భారీ నష్టాల్లో ముగిశాయి. ఇటీవల వరుసగా ఏడు సెషన్లలో లాభాల్లో కొనసాగిన మార్కెట్లు గురువారం భారీగా పతనమయ్యాయి. యూఎస్ టారిఫ్ విధానాల్లో స్పష్టత లేకపోవడం.. చమురు ధరల పెరుగుదల.. ఇటీవల మార్కెట్‌లో ర్యాలీ కొనసాగుతుండడంతో మదుపరులు లాభాల స్వీకరణకు దిగడంతో మార్కెట్లు ఒక్కసారిగా కుదేలయ్యాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ ఉదయం ఫ్లాట్‌గా మొదలైంది. ఆ తర్వాత కొద్దిసేపటికి సెన్సెక్స్ 78,167.87 గరిష్ఠానికి చేరుకుంది. ప్రారంభంలోనే 150.68 పాయింట్లు లాభపడింది. ఆ తర్వాత సెన్సెక్స్ అమ్మకాలతో ఒత్తిడికి గురైంది. దాంతో ఒక దశలో 822.97 పాయింట్లు పతనమైంది. ఇంట్రాడేలో 78,167.87 పాయింట్ల గరిష్ఠానికి చేరిన సెన్సెక్స్.. 77,194.22 పాయింట్ల కనిష్ఠాన్ని తాకింది. చివరకు 728.69 పాయింట్లు తగ్గి.. 77,288.50 వద్ద ముగిసింది. ఇక నిఫ్టీ 181.80 పాయింట్లు పతనమై.. 23,486.85కి చేరింది. నిఫ్టీలో ఇండస్ఇండ్ బ్యాంక్, ట్రెంట్, హెచ్‌సీఎల్ టెక్, హీరో మోటోకార్ప్, భారతీ ఎయిర్‌టెల్, గ్రాసిమ్, ఎంఅండ్ఎం, టైటాన్ కంపెనీ, బ్రిటానియా లాభపడ్డాయి. ఎన్టీపీసీ, టెక్ మహీంద్రా, సిప్లా, బజాజ్ ఫైనాన్స్, బీపీసీఎల్, యాక్సిస్ బ్యాంక్, అపోలో హాస్పిటల్, ఇన్ఫోసిస్, విప్రో నష్టపోయాయి.

యూఎస్ వాణిజ్య విధానంపై అనిశ్చిత మధ్య పెట్టుబడిదారులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల కొన్ని దేశాలకు టారిఫ్ నుంచి మినహాయింపులు ఉంటాయని ప్రకటించారు. అయితే, ఈ విషయంలో స్పష్టత కొరవడింది. ఈ అస్పష్టత కారణంగా భారత్‌తో సహా ప్రపంచవ్యాప్తంగా మార్కెట్లను అస్థిరపరిచింది. గతవారంలో దలాల్ స్ట్రీట్‌లో ర్యాలీ కొనసాగింది. ఈ క్రమంలో గురువారం పెట్టుబడిదారులు లాభాల స్వీకరణకు దిగడంతో మార్కెట్ ఒత్తిడికి గురైంది. ఫలితంగా సూచీలు పతనమయ్యాయి. మరో వైపు డాలర్ మారకంతో పోలిస్తే రూపాయి 6 పైసలు తగ్గి 85.78కి చేరింది. దీనికి తోడు వెనిజులా నుంచి చమురు, గ్యాస్ దిగుమతి చేసుకునే దేశాలపై సుంకాలు విధిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించిన నేపథ్యంలో చమురు ధరలు బుధవారం భారీగా పెరిగాయి. భారత్ ముడి చమురును దిగుమతి చేసుకుంటున్న విషయం తెలిసిందే. ముడి చమురు ధరలు పెరిగే అవకాశం ఉ ండడంతో భారత స్టాక్స్‌పై ప్రత్యక్షంగా ప్రభావం పడే అవకాశం ఉన్నది.

## భారత్‌ను వీడేందుకే సంపన్నుల ఆసక్తి..!

### సర్వేలో షాకింగ్ విషయాలు..!



**న్యూఢిల్లీ:** దేశానికి సంపన్నులు పలువురు భారత్‌ను వీడి ఇతర దేశాల్లో నివసించేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. కనీసం 22శాతం మంది సూపర్ రిచ్ ఇండియన్స్ మెరుగైన జీవన ప్రమాణాలు, సులభమైన వ్యాపార వాతావరణం తదితర కారణాలతో దేశాన్ని వీళ్లాలని కోరుకుంటున్నట్లుగా ఓ సర్వే షాకింగ్ విషయాలు వెల్లడించింది. ఈ సర్వే 150 మంది అల్ట్రా రిచ్ వ్యక్తులుపై నిర్వహించారు. సర్వే ప్రకారం.. ఆయా సంపన్నులంతా గోల్డెన్ వీసా స్కీమ్‌ని దృష్టిలో పెట్టుకొని.. అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా, కెనడా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ లాంటి దేశాల్లో స్థిరపడాలని కోరుకుంటున్నారు. దేశానికి చెందిన ప్రముఖ అసెట్ మేనేజర్ కంపెనీ కొటక్.. ప్రైవేట్ కన్సల్టింగ్ కంపెనీ ఈవైతో కలిసి సర్వే నిర్వహించింది.

వాస్తవానికి విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రకారం.. ప్రతి సంవత్సరం 25లక్షల మంది భారతీయులు ఇతర దేశాలకు వలస వెళ్తున్నారు. సర్వేలో పాల్గొన్న ప్రతి ఐదుగురు అల్ట్రా రిచ్ వ్యక్తుల్లో ఒకరు ప్రస్తుతం వలస వెళ్లే పనిలో కొందరు ఉండగా.. మరికొందరు వలస వెళ్లేందుకు యోచిస్తున్నారని సర్వే ఫలితాలు తెలిపాయి. ఇందులో చాలామంది తమ భారతీయ పౌరసత్వాన్ని నిలుపుకుంటూనే.. తమకు నచ్చిన దేశంలో శాశ్వతంగా నివసించాలని కోరుకుంటున్నట్లుగా సర్వే పేర్కొంది. మెరుగైన జీవన ప్రమాణాలు, ఆరోగ్య సంరక్షణ, విద్య, జీవనశైలిని కోరుకుంటున్నట్లుగా సర్వే పేర్కొంది. మూడింట రెండువంతుల కంటే ఎక్కువ మంది వ్యాపార కార్యకలాపాలు సులభతరం చేసేందుకు ప్రాధాన్యం ఇస్తున్నారు.

వారంతా వలస వెళ్లే నిర్ణయాన్ని 'భవిష్యత్ పెట్టుబడి'గా అభవర్ణించడంతో పాటు తమ పిల్లలకు మంచి ఉన్నత విద్యను అందించాలనే కోరిక కూడా వలసకు ప్రేరేపిస్తుందని సర్వే నివేదిక తెలిపింది. ఈ సందర్భంగా కొటక్ మహీంద్రా బ్యాంక్ చైర్మన్ గౌతమి గవాంకర్ మాట్లాడుతూ వలస వెళ్లే నిర్ణయాన్ని దేశం నుంచి బయటకు వెళ్లే మూలధనంగా చూడొద్దన్నారు. అలాంటి కార్యకలాపాలపై పరిమితులు విధించడం వల్ల ఓ వ్యక్తి తన నివాస స్థలాన్ని మార్చినప్పటికీ.. డబ్బు బయటకు వెళ్లదన్నారు. ప్రస్తుతం భారతీయ పౌరుడుద ఏశం నుంచి సంవత్సరానికి 2.50లక్షల డాలర్లు మాత్రమే తీసుకువెళ్లగలడని.. ప్రవాస భారతీయుడు మాత్రం మిలియన్ డాలర్లు తీసుకువెళ్లేందుకు అనుమతి ఉందన్నారు.

## పసిడి ధర మళ్లీ పెరిగింది..!



**న్యూఢిల్లీ:** బంగారం ధరలు కొనుగోలుదారులకు షాక్ ఇచ్చాయి. రికార్డు స్థాయికి ధరలు చేరగా.. ఇటీవల వరుసగా నాలుగు రోజులు తగ్గుతూ వచ్చి ఊరటనిచ్చాయి. తాజాగా బుధవారం మార్కెట్‌లో ధర మళ్లీ పెరిగింది. రూ.235 పెరిగి తులం ధర రూ.రూ.90,685కి చేరుకున్నాయని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ తెలిపింది. 99.5 శాతం ప్యూరిటీ బంగారం 10 గ్రాములకు రూ.235 పెరిగి రూ.90,235కి చేరింది. ఇటీవలి నష్టాల తర్వాత రిటైలర్లు తాజాగా కొనుగోలు చేయడంతో పసిడి ధరలు పెరిగినట్లుగా వ్యాపారులు పేర్కొంటున్నారు. గ్లోబల్ మార్కెట్‌లో బలమైన ట్రెండ్ కారణంగా సెంటిమెంట్‌ను ప్రభావితం చేసిందని పేర్కొన్నారు. ఇక వెండి ధర రూ.1,500 పెరిగి కిలోకు రూ.1,01,500కి చేరింది. మరో వైపు ప్రపంచ మార్కెట్‌లో స్పాట్ గోల్డ్ 0.16 శాతం పెరిగి ఔన్సుకు 3,024.96 డాలర్లకు చేరింది.

పెట్టుబడిదారుల డిమాండ్, సురక్షితమైన పెట్టుబడి గోల్డ్‌కి డిమాండ్, ఈటీఎఫ్‌ల నుంచి బలమైన ఇన్‌ఫ్లో కారణంగా బుధవారం బంగారం స్వల్పంగా పెరిగింది. ఇక ఏప్రిల్ 2న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాలపై కొత్త వాణిజ్య విధానాన్ని ప్రకటించనున్నారు. యూఎస్ సుంకాల నిర్ణయంపై అనిశ్చితి కారణంగా బంగారానికి మద్దతు లభిస్తుందని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ సీనియర్ (కమోడిటీస్) విశ్లేషకులు సౌమిల్ గాంధీ తెలిపారు. సెక్యూరిటీస్, కమోడిటీ అండ్ కరెన్సీ, రీసెర్చ్ అనలిస్ట్-వైస్ ప్రెసిడెంట్ జతిన్ త్రివేది మాట్లాడుతూ ఈ వారం చివరలో విడుదలకానున్న యూఎస్ జీడీపీ, కోర్ పర్సనల్ కన్స్యూమ్ ఎక్స్‌పెన్షన్ ప్రైస్ ఇండెక్స్‌తో సహా కీలకమైన స్థూల ఆర్థిక డేటా కోసం మార్కెట్‌కు చెందిన వారంతా ఎదురు చూస్తున్నారన్నారు. రష్యా-ఉక్రెయిన్ పరిణామాలు సైతం విస్తృత ధోరణిని ప్రభావితం చేస్తాయని.. డిమాండ్‌ను పెంచుతుందని త్రివేది పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. హైదరాబాద్‌లో 22 క్యారెట్ల గోల్డ్ రూ.81,950 ఉండగా.. 24 క్యారెట్ల పసిడి ధర రూ.89,400గా ఉన్నది. ఇక కిలో వెండి ధర రూ.1,11,000గా చేరింది.

# డికాక్ ఖతర్నాక్ ఇన్నింగ్స్..

### బోణీ కొట్టిన కోల్‌కతా..!

**గౌహతీ:** ఐపీఎల్ 18వ సీజన్‌ను ఓటమితో ఆరంభించిన కోల్‌కతా నైట్ రైడర్స్ బోణీ కొట్టింది. స్వల్ప ఛేదనలో ఓపెనర్ క్వింటన్ డికాక్(97 నాటౌట్) అజేయ అర్ధ శతకంతో చెలరేగి జట్టుకు విజయాన్ని అందించాడు. మొదట బంతితో రాజస్థాన్ రాయల్స్‌ను కట్టడి చేసిన కోల్‌కతా ఆపై 152 పరుగుల లక్ష్యాన్ని ఛేదించింది. టర్నింగ్ అవుతున్న పిచ్‌పై ఓపెనర్ డికాక్ సాధికారిక ఇన్నింగ్స్ ఆడాడు. ఇంప్యాక్ట్ ప్లేయర్ అంగ్‌క్రిష్ రఘువంశీ(18 నాటౌట్) సహకారంతో జట్టును గెలుపు దిశగా నడిపాడు. జోఫ్రా ఆర్చర్ వేసిన 18వ ఓవర్లో 4, 6, 6 బాదిన డికాక్ కోల్‌కతాకు సూపర్ విక్టరీని కట్టబెట్టాడు. దాంతో, తొలి సీజన్ చాంపియన్ రాజస్థాన్‌కు వరుసగా రెండో ఓటమి మూటగట్టుకుంది.

డిఫెండింగ్ ఛాంపియన్ కోల్‌కతా పంజా విసిరింది. గువాహటిలో ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టిన కేకేఆర్ అద్భుత విజయాన్ని సొంతం చేసుకుంది. ఓపెనర్ క్వింటన్ డికాక్(97 నాటౌట్ : 61బంతుల్లో 8 ఫోర్లు, 6 సిక్సర్లు) చివరిదాకా నిలబడి జట్టును గెలిపించాడు. స్వల్ప ఛేనదలో ఓపెనర్ మోయిన్ అలీ(5) వెనుదిరిగాక.. కెప్టెన్ అజింక్యా రహానే(18)లు వెనుదిరిగిన తన మార్క్ షాట్లతో చెలరేగాడు డికాక్. ఇంప్యాక్ట్ ప్లేయర్ అంగ్‌క్రిష్ రఘువంశీ(18 నాటౌట్)





సాయంతో కోల్‌కతా స్కోర్‌బోర్డును నడిపించాడు. దాంతో, 11 ఓవర్లకు కోల్‌కతా 2 వికెట్ల నష్టానికి 80 పరుగులు చేసింది. స్పిన్నర్లతో ఒత్తిడి పెంచే ప్రయత్నాన్ని తిప్పికొట్టిన ఈ లెఫ్ట్ హ్యాండర్. ఆర్చర్ బౌలింగ్‌లోవరుసగా 4, 6 బాది..మరో సిక్సర్‌తో రాజస్థాన్‌కు రెండో ఓటమి ఖాయం చేశాడు.

#### ఆది నుంచి తడబడుతూ

టాస్ ఓడిన రాజస్థాన్ ఇన్నింగ్స్ ఆది నుంచి తడబడుతూ సాగింది. ఓపెనర్లు యశస్వీ జైస్వాల్(13), సంజూ శాంసన్(29)లు శుభారంభమిచ్చినా స్పిన్నర్ల రాకతో వికెట్ల పతనం మొదలైంది. 3 ఓవర్లకే 28 పరుగులు రాబట్టిన ఈ జోడిని వైభవ్ అరోరా విడదీశాడు. శాంసన్ బౌల్డ్ అయ్యాక వచ్చిన కెప్టెన్ రియాన్ పరాగ్ (25) ఉన్నంత సేపు బౌండరీతో విరుచుకపడ్డాడు. అతడికి చెక్ పెట్టేందుకు రహానే తమ అస్త్రం వరుణ్ చక్రవర్తికి బంతి అందించాడు. ఊహించినట్టే పరాగ్ వికెట్ పారేసుకున్నాడు. ఆ తర్వాత ధ్రువ్ జురెల్(33) ఒంటరి పోరాటం చేసి జట్టు స్కోర్ 130 దాటించాడు. అతడు ఔటయ్యాక పేసర్ జోఫ్రా ఆర్చర్(16) ధనాధన్ ఆడడంతో రాజస్థాన్ నిర్ణీత ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 151 పరుగులు చేయగలిగింది.

### బీసీసీఐకి షాక్.. ఆదాయంలో

## భారీ కోత విధించనున్న ఐసీసీ..!



**న్యూఢిల్లీ:** ప్రపంచంలోనే సంపన్నమైన బోర్డు భారత క్రికెట్ నియంత్రణ మండలికి పెద్ద షాక్ తగలనుంది. ఇకపై ప్రతి ఏటా అంతర్జాతీయ క్రికెట్ మండలి నుంచి వచ్చే ఆదాయం భారీగా తగ్గిపోనుంది. వరల్డ్ క్రికెట్ సంఘం (డబ్ల్యూసీఏ) ఒత్తిడి మేరకు బీసీసీఐ తాను అందుకుంటున్న సింహ భాగం వాటాను కోల్పోనుంది. ప్రపంచ క్రికెట్లో ఆదాయ పంపిణీలో అసమానతలు ఉ న్నాయని, ధనిక బోర్డుకు ఇచ్చే వాటాను తగ్గించుకోవాలని ప్రపంచ క్రికెట్ సంఘం ఈమధ్యే ఐసీసీకి సూచన చేసింది. ఈ క్రమంలోనే బీసీసీఐకి సమర్పిస్తున్న 40 శాతం వాటాను 10 శాతానికి తగ్గించుకోవాలని సూచించింది డబ్ల్యూసీఏ. అయితే.. ఈ విషయమై ఐసీసీ ఛైర్మన్ జై షా, పాలక మండలి ఇంకా నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఐసీసీ తర్వాత ప్రపంచ క్రికెట్‌లో బీసీసీఐ పెద్దన్నలా వ్యవహరిస్తూ వస్తోంది. ఈమధ్యే పాకిస్థాన్ వేదికగా జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీలో టీమిండియా మ్యాచ్‌లను దుబాయ్‌లో నిర్వహించడంపై విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఆదాయ అసమానతల గురించి .. బీసీసీఐ వాటా 30 శాతం తగ్గించడం గురించి ప్రపంచ క్రికెట్ సంఘం సూచన చేయడం బీసీసీఐకి తలనొప్పిగా మారనుంది.

### ఐపీఎల్‌లో 150 వికెట్లు..

## బుమ్రాను దాటేసిన రషీద్..!



**న్యూఢిల్లీ:** బ్యాటర్ల మెరుపులతో భారీ స్కోర్లు నమోదవుతున్న ఇండియన్ ప్రీమియర్ లీగ్ 18వ సీజన్‌లో కొందరు స్టార్ బౌలర్లు తమ ముద్ర వేస్తున్నారు. కీలక సమయాల్లో వికెట్లు తీస్తూ.. ప్రత్యర్థి ఆటగాళ్ల జోరుకు కళ్లెం వేస్తున్నారు. గుజరాత్ టైటన్స్‌కు ఆయువుపట్టులా మారిన రషీద్ ఖాన్ వ్యక్తిగతంగా అరుదైన మైలురాయికి చేరుకున్నాడు. మిస్టరీ బౌలింగ్‌తో ఇరుకున పెట్టే ఈ స్పిన్నర్ 150 వికెట్లు తన ఖాతాలో వేసుకున్నాడు. మార్చి 25న నరేంద్ర మోడీ స్టేడియంలో పంజాబ్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో రషీద్ ఈ ఘనత సాధించాడు. ఓపెనర్ ప్రియాన్ష్ ఆర్యాను ఔట్ చేసి.. 150 క్లబ్‌లో చేరాడీ అఫ్గనిస్థాన్ సారథి. ఈ క్రమంలోనే ముంబై ఇండియన్స్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా రికార్డును రషీద్ బద్దలు కొట్టాడు. ముంబై యార్కర్ కింగ్ కంటే వేగంగా 150 వికెట్ల ఫీట్ సాధించాడీ స్పిన్నర్. బుమ్రా 124 మ్యాచుల్లో ఈ మైలురాయికి చేరుకుంటే.. రషీద్ కేవలం 122 మ్యాచుల్లోనే 6.86 ఎకానమీతో నూట యాభై వికెట్ల క్లబ్‌లో చేరిపోయాడు. తద్వారా ఐపీఎల్ చరిత్రలో తక్కువ మ్యాచుల్లోనే 150 వికెట్లు తీసిన మూడో బౌలర్‌గా రికార్డు నెలకొల్పాడు రషీద్. వెటరన్ పేసర్ లసిత్ మలింగ 105 మ్యాచుల్లో.. యజ్వేంద్ర చాహల్ 118 మ్యాచుల్లో ఈ ఘనత సొంతం చేసుకున్నారు.

సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆటగాడిగా 2017లో ఐపీఎల్‌లో అరంగేట్రం చేశాడు రషీద్. ఐదు సీజన్లు ఆరెంజ్ ఆర్మీతో కొనసాగిన అతడిని 2022 వేలంలో గుజరాత్ టైటాన్స్ భారీ ధరకు కొన్నది. ఈ ఏడాది హార్దిక్ పాండ్యా సారథ్యంలో బ్యాటుతో, బంతితో రాణించిన రషీద్.. తమ ఫ్రాంచైజీ టైటిల్ విజేతగా అవతరించడంలో కీలక పాత్ర పోషించాడు. ఐపీఎల్‌లో రషీద్ అత్యుత్తమ ప్రదర్శన విషయానికొస్తే.. 2023 సీజన్‌లో అతడు బంతితో చెలరేగిపోయాడు.

### అభిమానులకు గుడ్‌న్యూస్..

## భారత్‌కు వచ్చేస్తున్న ఫుట్‌బాల్ మాంత్రికుడు

**న్యూఢిల్లీ:** ఫుట్‌బాల్ లెజెండ్ లియోనల్ మెస్సీ ఆట చూసేందుకు కోట్లాది మంది ఎగబడుతారు. అతడి ఆటోగ్రాఫ్ కోసం పోటీపడుతారు. తన సొగసైన ఆటతో కోట్లాది మందిని అభిమానగణంగా సొంతం చేసుకున్న ఈ స్టార్ ప్లేయర్ మైదానంలోకి దిగాడంటే.. గోల్స్ వర్షం కురవాల్సిందే. మనదేశంలోనూ ఫ్యాన్స్ బోలెడు మంది ఫ్యాన్స్ ఉన్నారు మెస్సీకి. అందుకే అతడు త్వరలోనే భారత్‌కు రాబోతున్నాడు.

'కేరళలోని కొచ్చిలో ఒక అంతర్జాతీయ ఎగ్జిబిషన్ మ్యాచ్ ఉంది. అక్టోబర్‌లో జరుగబోయే ఈ మ్యాచ్‌లో ఆడేందుకు ఫుట్‌బాల్ మాంత్రికుడు మెస్సీ మనదేశంలో వాలిపోనున్నాడ'ని కేరళ క్రీడా మంత్రి వీ అబ్దురహిమన్ మంగళవారం వెల్లడించాడు. దాంతో, కేరళవ్యాప్తంగా ఫ్యాన్స్ సంబురాల్లో మునిగితేలుతున్నారు.

#### మొదటిసారిగా 2011లో

సాకర్ దిగ్గజం మెస్సీ వరల్డ్ కప్ క్వాలిఫయర్



మ్యాచ్‌లో ఆడేందుకు 2011లో భారతదేశానికి వచ్చాడు. అప్పుడు కోల్‌కతాలో జర వెనిజులాతో జరిగిన పోరులో అర్జెంటీనా 1-0తో విజయం సాధించింది. దాదాపు 14 ఏళ్ల తర్వాత మళ్లీ ఈ దిగ్గజ ఆటగాడు మనదేశంలో ఫుట్‌బాల్ ఆడేందుకు వస్తున్నాడు. అది కూడా తనను అమితంగా ఆరాధించే అభిమానులున్న కేరళలో మెస్సీ ఒక అంతర్జాతీయ ఎగ్జిబిషన్ మ్యాచ్ ఆడనున్నాడు.

ప్రపంచంలోని మేటి ఫుట్‌బాలర్లలో ఒకడైన మెస్సీ 8సార్లు బాలన్ డి ఓర్ అవార్డు గెలుపొంది. మూడేళ్ల క్రితం అర్జెంటీనాకు వరల్డ్ కప్ అందించి తన కలను సాకారం చేసుకున్నాడు. అయితే.. 2026లో జరుగబోయే ఫిఫా ప్రపంచ కప్‌లో మెస్సీ ఆడడంపై సందేహాలు నెలకొన్నాయి. ప్రస్తుతం మెస్సీ.. ఇంటర్ మియామి క్లబ్ తరఫున ఆడుతున్న విషయం తెలిసిందే.

# అందాల కాజల్.. తల్లయ్యాక కూడా తగ్గేదే లే అన్నట్లుగా హాట్ ట్రీట్



**టాకీస్:** రెండు తరాల స్టార్ హీరోలతో ఆన్ స్క్రీన్ రొమాన్స్ చేసి స్టార్ హీరోయిన్‌గా యువ హృదయాలను కొల్లగొడుతోంది కాజల్ అగర్వాల్. వెండితెర చందమామగా క్రెడిట్ కొట్టేసిన ఈ బ్యూటీ.. ఎన్నో సూపర్ డూపర్ హిట్ సినిమాల్లో నటించింది. సౌత్ ఇండియన్ స్టార్ హీరోయిన్ గా కెమెరా ముందు తన టాలెంట్ చూపించి తనకంటూ ప్రత్యేక అభిమాన వర్గాన్ని కూడగట్టుకుంది కాజల్. అంచెలంచెలుగా ఎదుగుతూ తెలుగుతో పాటు పలు దక్షిణాది భాషా చిత్రాల్లో నటించింది. కెరీర్ పీక్స్ లో ఉన్న సమయంలోనే తన ప్రియుడు గౌతమ్ కిచ్లుని ప్రేమించి పెళ్లాడిన కాజల్.. పెళ్లి తర్వాత సినిమాలకు కాస్త దూరంగా ఉంటూ వైవాహిక జీవితాన్ని ఎంజాయ్ చేస్తోంది. పెళ్లి జరగ్గానే భర్తతో కలిసి రొమాంటిక్ టూర్స్ వేస్తూ విదేశాలు చుట్టివచ్చిన ఈ భామ ఏడాది తిరిగే లోపు పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. కెరీర్ పీక్స్ లో ఉన్న సమయంలోనే తన ప్రియుడు గౌతమ్ కిచ్లుని ప్రేమించి పెళ్లాడిన కాజల్.. పెళ్లి తర్వాత సినిమాలకు కాస్త దూరంగా ఉ ంటూ వైవాహిక జీవితాన్ని ఎంజాయ్ చేస్తోంది. పెళ్లి జరగ్గానే భర్తతో కలిసి రొమాంటిక్ టూర్స్ వేస్తూ విదేశాలు చుట్టివచ్చిన ఈ భామ ఏడాది తిరిగే లోపు పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. మూడున్నర పదుల వయసు దాటిపోతున్నా కూడా కుర్ర హీరోయిన్లకు ఏ మాత్రం తీసిపోని అందాలను మెయింటేన్ చేస్తోంది. పెళ్లి తర్వాత కూడా వరుసగా సినిమాలు చేస్తున్న ఈ బ్యూటీ.. ఇప్పుడు సౌత్ తో పాటు నార్త్ లో కూడా బిజీగా గడిపేస్తోంది. ఇక ఎంత బిజీగా ఉ ంటున్నా సరే తన ఫ్యాన్స్ కోసం ఘాటు అందాలను సోషల్ మీడియాలో ఆరబోస్తూనే ఉంటుంది. ఎప్పటికప్పుడు హాట్ హాట్ ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేసే కాజల్.. తాజాగా మరోసారి రెచ్చిపోయింది. ఇందులో ఆమె తన ఘాటు సొగసులను మరోసారి బయట పెట్టేసింది. ఇందులో తన టాప్ లెస్ డ్రెస్ లో రెచ్చిపోయింది. ముందరి అందాలను ఘాటుగా చూపిస్తూ ఊరిస్తోంది. ఇందులో ఎద పొంగులతో పాటు నడుము వయ్యారాలను కూడా చూపిస్తోంది. కాజల్ పెళ్లి తర్వాత ఈ రేంజ్ లో రెచ్చిపోవడం చూసి అంతా షాక్ అవుతున్నారు. ఎంతైనా కాజల్ అంటే ఆ మాత్రం ఉండాల్సిందే కదా. ప్రస్తుతం హీరోయిన్ గా ఛాన్సులు రాకపోయినా.. కీలక పాత్రల్లో నటిస్తూ బిజీగానే ఉంటుంది ఈ బ్యూటీ. ఇప్పుడు తెలుగులో మూడు సినిమాల్లో నటిస్తోంది. త్వరలోనే ఓ స్టార్ హీరో సినిమాలో కనిపించబోతున్నట్టు వార్తలు వస్తున్నాయి.

# మోహన్‌లాల్ పూజలపై ముస్లింలు ఆగ్రహం



**టాకీస్:** ఇద్దరు దక్షిణాది సూపర్‌స్టార్లే. చాలామంది వాళ్లిద్దరు ఇండస్ట్రీలో ప్రత్యర్థులని పొరపడుతారు.. కాని ఇద్దరు ఆప్తమిత్రులు మమ్ముటి , మోహన్‌లాల్ ఫ్రెండ్‌షిప్ విషయంలో కొత్త వివాదం తెరపైకి వచ్చింది. అనారోగ్యంతో బాధపడుతున్న మమ్ముట్టి తొందరగా కోలుకోవాలని శబరిమల అయ్యప్ప ఆలయంలో మోహన్‌లాల్ పూజలు చేయడంపై వివాదం రాజుకుంది. శబరిమలలో మోహన్ లాల్ పూజలు చేసిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారడంతో ఆయనపై ముస్లిం సంస్థలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. మమ్ముటి ముస్లిం.. ఆయన అసలు పేరు మహ్మద్ కుట్టి.. అలాంటప్పుడు ఆయన వేగం గా కోలుకోవాలని అల్లానే ప్రార్థించాలి .. కాని అయ్యప్పస్వామిని ఎలా మోహన్‌లాల్ వేడు కుంటారని కొన్ని ముస్లిం సంస్థలు ప్రశ్నిస్తున్నా యి. శబరిమలలో మోహన్‌లాల్ ఆయన కోసం ప్రత్యేక పూజలు చేయడాన్ని తప్పుపడుతు న్నాయి. వాస్తవానికి చాలామంది అభిమానులు మోహన్‌లాల్ తీరును ప్రశంసించారు. కాని కొంతమంది ఇస్లామిక్ పద్ధతులను అవమానించారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అయితే తనపై విమర్శలు చేస్తున్న వాళ్ల తీరుపై మండిపడ్డారు మోహన్‌లాల్. మమ్ముట్టి తనకు ఆప్తమిత్రుడని , అలాంట ప్పుడు ఆయన ఆరోగ్యం కోసం పూజలు చేస్తే ఎలా తప్పు అవుతుందని ప్రశ్నించారు. మమ్ముట్టి అనారోగ్యం నుంచి వేగంగా కోలుకుంటున్నారని తెలిపారు.. మమ్ముట్టి ఆరోగ్యంపై గత కొంతకాలంగా సంచలన వార్తలు వెలుగు లోకి వస్తున్నాయి. మమ్ముట్టి క్యాన్సర్‌తో బాధపడుతున్నారని పుకార్లు షికార్లు చేశాయి.

## జపాన్‌లో దేవర సెలబ్రేషన్స్‌లో

# ఎన్టీఆర్ సందడి





**టాకీస్:** జూనియర్ ఎన్టీఆర్ టైటిల్ రోల్‌లో నటించిన బ్లాక్ బస్టర్ చిత్రం దేవర. కొరటాల శివ దర్శకత్వం వహించిన ఈ మూవీ రెండు పార్టులుగా తెరకెక్కుతుండగా.. దేవర పార్టు 1 గతేడాది సెప్టెంబర్ 27న థియేటర్లలో ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదలై సూపర్ హిట్ టాక్ తెచ్చుకోవడమే కాకుండా దాదాపు రూ.500 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టింది. ఇప్పుడు ఇదే సినిమాను జపాన్‌లో విడుదల చేస్తున్నారు మేకర్స్. ఎన్టీఆర్ గత చిత్రాలకు జపాన్‌లో మంచి క్రేజ్ ఉందన్న విషయం తెలిసిందే. ఇప్పటికే అక్కడ విడుదలైన బాద్‌షాతో పాటు ఆర్‌ఆర్‌ఆర్ చిత్రాలు మంచి కలెక్షన్లు సాధించాయి. ఈ నేపథ్యంలోనే దేవర సినిమాను జపాన్‌లో మార్చి 28న గ్రాండ్‌గా విడుదల చేయబోతున్నారు మేకర్స్. ఈ సందర్భంగా జపాన్‌కి వెళ్లిన ఎన్టీఆర్ దర్శకుడు కొరటాల శివ.. జపాన్ అభిమానులను కలవడంతో పాటు అక్కడి స్థానిక మీడియాలలో దేవర ప్రమోషన్స్‌లో పాల్గొంటున్నారు. అయితే జపాన్ ప్రజల ప్రేమకు ఫిదా అయిన తారక్ తాజాగా వారితో ఉన్న ఒక వీడియోను ఎక్స్ వేదికగా పంచుకున్నాడు. మీ ప్రేమతో నా మనసు నిండిపోయింది. జపనీస్ ప్రేక్షకులు మార్చి 28 నుండి సినిమా హాళ్లలో "దేవర"ని అనుభవించడానికి నేను వేచి ఉండలేను అంటూ రాసుకోచ్చాడు.

# ప్రస్తుతం ఆమె కోలుకుంటున్నారు

## భార్య హెల్త్‌పై అప్‌డేట్ చెప్పిన సోనూసూద్

**టాకీస్:** బాలీవుడ్ స్టార్ నటుడు, రియల్ హీరో సోనూ సూద్ భార్య సోనాలి సూద్ రోడ్డు ప్రమాదానికి గురైన విషయం తెలిసిందే. ప్రస్తుతం నాగ్‌పూర్‌లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో తన భార్య సోనాలిసూద్ ఆరోగ్యంపై సోనూసూద్ తాజాగా స్పందించారు. ఈ మేరకు హెల్త్ అప్‌డేట్ ఇచ్చారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన తన భార్య, మరో ఇద్దరు కుటుంబ సభ్యులు కోలుకుంటున్నట్లు చెప్పారు. వాళ్లు త్వరగా కోలుకోవాలని దేవుడిని ప్రార్థించిన ప్రతి ఒక్కరికీ ఈ సందర్భంగా సోనూసూద్ కృతజ్ఞతలు



తెలిపారు. ఈ మేరకు సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. కాగా, సోనాలి సూద్ తన సోదరి, సోదరి కుమారుడితో కలిసి సోమవారం రాత్రి కారులో ప్రయాణిస్తున్నారు. ఈ క్రమంలో ముంబై నాగ్‌పూర్ సమృద్ధి హైవేపై వీరి కారు ట్రక్కును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో సోనాలి, ఆమె సోదరి కుమారుడికి తీవ్రంగా గాయాలయ్యాయి. ఆమె సోదరి మాత్రం స్వల్ప గాయాలతో బయటపడ్డారు. సోనాలి, ఆమె సోదరి కుమారుడు ప్రస్తుతం నాగ్‌పూర్‌లోని మ్యాక్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రమాదంలో వారి కారు పూర్తిగా దెబ్బతిన్నది.

# ఒక్క ఏడాదిలో భాగ్యశ్రీ బోర్సే మూడు సినిమాలు

**టాకీస్:** మాస్ మాహారాజా రవితేజ నటించిన మిస్టర్ బచ్చన్ సినిమాతో తెలుగు తెరకు కథానాయికగా పరిచయమైంది హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్ అయ్యింది. కానీ ఈ బ్యూటీ మాత్రం స్పెషల్ అట్రాక్షన్ అయ్యింది. తెలుగులో చేసిన ఒక్క సినిమా నిరాశపరిచింది కానీ... ఈ అమ్మడు స్పీడ్ మాత్రం మాములుగా లేదు. చేసింది తక్కువ సినిమాలే అయినప్పటికీ చూస్తుండగానే స్టార్ బ్యూటీలను వెనక్కు నెట్టేస్తోంది. ప్రస్తుతం ఇండస్ట్రీలో టాక్ ఆఫ్ ది టాలీవుడ్ అవుతోంది ఈ బ్యూటీ. ఫస్ట్ సినిమాతోనే యాక్టింగ్, గ్లామర్ పరంగా మంచి మార్కులే కొట్టేసిన ఈ వయ్యారి.. ప్రస్తుతం దుల్కర్ సల్మాన్ సరసన కాంత సినిమాలో నటిస్తుంది. అలాగే విజయ్ దేవరకొండ జోడిగా కింగ్ డమ్ మూవీ చేస్తుంది. ఇవే కాకుండా తెలుగులో మరిన్ని ఆఫర్స్ కొట్టేసింది. ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేనితో కలిసి కొత్త ప్రాజెక్ట్ చేయనున్నట్లు తెలుస్తోంది. మొత్తానికి ఈ ఏడాదిలోనే ఏకంగా మూడు సినిమాలో అడియన్స్ ముందుకు రానుంది ఈ వ్యయారి. కింగ్ డమ్ సినిమాలో మేలో రిలీజ్ కానుంది. రామ్ పోతినేనితో చేస్తోన్న సినిమా షూటింగ్ వేగంగా జరుగుతుంది. దుల్కర్ సల్మాన్, భాగ్యశ్రీ బోర్సే నటిస్తోన్న కాంత మూవీ ఈ ఏడాది చివర్లో విడుదల కానున్నట్లు తెలుస్తోంది. ఈ ఏడాదిలోనే మూడు సినిమాలతో బాక్సాఫీస్ వద్ద సందడి చేయనుంది.



## ఓటీటీలో దుమ్మురేపుతున్న

# గేమ్‌ఛేంజర్





**టాకీస్:** గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, కియారా అద్వానీ జంటగా నటించిన చిత్రం గేమ్ ఛేంజర్. దిగ్గజ దర్శకుడు శంకర్ దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రం సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు వచ్చి మిక్స్‌డ్ టాక్‌తో బాక్సాఫీస్ వద్ద భారీ డిజాస్టర్‌ను అందుకుంది. ఆర్‌ఆర్‌ఆర్ వంటి బ్లాక్ బస్టర్ తర్వాత రామ్ చరణ్ సినిమా కావడంతో మెగా అభిమానులు భారీ నమ్మకం పెట్టుకున్నారు. అయితే శంకర్ అదే పాత స్టోరీతో ప్రేక్షకుల ముందు రావడంతో భారీ నష్టాన్ని చవి చూసింది. రూ.450 కోట్ల బడ్జెట్‌తో ఈ సినిమా రాగా దాదాపు రూ.150 కోట్ల నష్టం వచ్చినట్లు సమాచారం. అయితే ఈ సినిమా ప్రస్తుతం ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ అవుతున్న విషయం తెలిసిందే. తెలుగుతో పాటు తమిళ, కన్నడ భాషల్లో ఈ సినిమా ప్రస్తుతం స్ట్రీమింగ్ అవుతుంది. అయితే తాజాగా ఈ మూవీ హిందీ వెర్షన్‌ని జీ5 ఓటీటీ వేదిక మార్చి 07న విడుదల చేసింది. హిందీ వెర్షన్ ఓటీటీలోకి వచ్చిన తొలిరోజు నుంచే ఈ సినిమా టాప్ టెన్‌లో దూసుకుపోతుంది. ఈ చిత్రం హిందీలో ఇప్పటివరకూ 250 మిలియన్ మినిట్స్‌కు పైగా వ్యూస్ సాధించినట్లు జీ5 ఎక్స్ వేదికగా పంచుకుంది. ఈ సందర్భంగా కొత్త పోస్టర్‌ను పంచుకుంది. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. రామ్‌నందన్ (రామ్‌చరణ్) విశాఖ కలెక్టర్‌గా బాధ్యతలు తీసుకుంటాడు. ఇదే సమయంలో అభ్యుదయ పార్టీ నాయకుడు, ముఖ్యమంత్రి సత్యమూర్తి (శ్రీకాంత్) పదవీకాలం మరో ఏడాదిలో ముగుస్తుంది. సత్యమూర్తి కొడుకు బొబ్బిలి మోపిదేవి (ఎస్.జె.సూర్య) ముఖ్యమంత్రి కుర్చీపై కన్నేస్తాడు. తండ్రిని అడ్డుతొలగించి పదవి కోసం ఓ పన్నాగం పన్నుతాడు. సరిగ్గా ఇదే సమయంలో రామ్‌నందన్‌కు సంబంధించిన ఓ రహస్యం బయటపడుతుంది. ఏమిటా రహస్యం..? రామ్‌నందన్‌కు సత్యమూర్తికి వున్న అనుబంధం ఏమిటి..? ఈ కథలో అప్పన్న (రామ్‌చరణ్) ఎవరు? ముఖ్యమంత్రి కుర్చీ కోసం మోపిదేవి చేసిన కుట్రలని రామ్‌నందన్ ఎలా తిప్పికొట్టాడు? ఇవన్నీ తెరపై చూడాలి.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.